ప్రజావాణి దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలి

సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:
ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె.హైమావతి సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. జిల్లాలో 216 దరఖాస్తులను స్వీకరించినట్లు తెలిపారు. కాగా అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామానికి చెందిన ఓ రైతు తన భూ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ప్రజావాణిలో బైఠాయించి నిరసన తెలిపారు. అంతకు ముందు జిల్లా అధికారలతో ఆమె సమావేశం నిర్వహించి మాట్లాడారు. 5 నెలల క్రితం చనిపోయిన కోహెడ మండలం చెంచల్‌చెరువుపల్లి ఐకెపి కమ్యూనిటీ కో-ఆర్డినేటర్ జె.శ్రీనివాస్ కుటుంబానికి శ్రీనిధి ద్వారా రూ.లక్ష 50 వేల ఆర్థిక సహాయం చెక్కును కలెక్టర్ అందించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డిఆర్వో నాగరాజమ్మ, డిఆర్‌డిఎపిడి జయదేవ్ ఆర్య, ఏవో రాజ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

ప్రజావాణి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి మున్సిపాలిటీ, ఏప్రిల్ 6, ప్రభాతవార్త : ప్రజావాణిలో ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు మాధురి, పాండు, సబ్ కలెక్టర్ ఉమా హారతితో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలు తమ సమస్యల పరిష్కారంపై నమ్మకంతో ప్రజావాణి కార్యక్రమానికి వస్తున్నారని, అందువల్ల ప్రతి అర్జీపై సంబంధిత అధికారులు బాధ్యతాయుతంగా స్పందించి, క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ రోజున నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 67 అర్జీలు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర సంబంధిత అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

బహుమతులను అందజేస్తున్న కలెక్టర్ హైమావతి

ఆరోగ్యవంతమైన జీవన విధానంతో

దీర్ఘాయువును పొందవచ్చు

సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:
ఆరోగ్యవంతమైన జీవన విధానం పాటించడం ద్వారా దీర్ఘాయువును పొందవచ్చని జిల్లా కలెక్టర్ కె.హైమావతి అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా వారం రోజుల పాటు నిర్వహించనున్న హెల్త్‌వీక్‌లో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఫుడ్ సేఫ్టీ ఫోకస్ డే కార్యక్రమం నిర్వహించి ఈట్ రైట్ అనే నినాదంతో ఆరోగ్యవంతమైన ఆహారం తినడంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె.హైమావతి మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రాణాళిక కార్యక్రమంలో భాగంగా మార్చి మొదటి వారం పరిశుభ్రత, పచ్చదనంపై కార్యక్రమాలు నిర్వహించామని ఈనెల 2న గ్రామసభలు, మున్సిపల్ వార్డు సభలు నిర్వహించినట్లు వివరించారు. ఏప్రిల్ 16న మండల సభ, తర్వాత నియోజకవర్గస్థాయి, జిల్లా స్థాయి సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆహారమే ఆరోగ్యమని అందరూ ఆరోగ్యవంతమైన ఆహారం తీసుకోవాలన్నారు. హెల్త్ విక్‌లో అవగాహన పెంచుకొని మితాహారం, పౌష్టికాహారం తీసుకోవాలని యోగ, వ్యాయామం చేయాలని విద్యార్థులకు సూచించారు. జిల్లా వైద్యాధికారి ధన్‌రాజు జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారి ప్రవీణ్, జిల్లా సంక్షేమ అధికారి శారద, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సునీత తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా ఈట్ రైట్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు, సిబ్బందికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజావాణికి దరఖాస్తులు కరువు

-అధికారుల గైర్హాజరుపై తహసీల్దార్ ఆగ్రహం

చౌటకూరు, ఏప్రిల్ 6, ప్రభాతవార్త: మండల కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం ప్రజల ధరఖాస్తులకు నోచుకోలేకపోతోంది. ప్రజావాణికి ఆయా శాఖల అధికారులు దుమ్మా కొడుతుండటంతోనే ప్రజలకు ప్రజావాణిపై నమ్మకం సన్నగిల్లడంతో దరఖాస్తులు చేసుకోవడంలేదన్న ప్రచారం సాగుతోంది. కార్యక్రమానికి హాజరుకావాలని పలుమార్లు సూచించినా అధికారులు ప్రజావాణికిక దూరంగా ఉంటున్నారని తహసీల్దార్ నామాల కిష్టయ్య అసహనం వ్యక్తం చేశారు. ఇక నుంచి ప్రతి అధికారి ప్రజావాణికి విధిగా హాజరై ప్రజలు అందచేసిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ప్రజావాణిపై నమ్మకం సన్నగిల్లకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందని తహసీల్దార్ ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ శంకర్, ఎంఇవో అనురాధ, పశువైద్యాధికారి విశాల్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పాల్గొన్నారు.

ఉత్తమ గైనకాలజిస్ట్‌గా డాక్టర్ అన్నపూర్ణ ఎంపిక

గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 6 (ప్రభాతవార్త): ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్య ఆరోగ్య రంగంలో విశేష ప్రతిభ కనబరిచిన వారికి అందజేసే రాష్ట్ర స్థాయి పురస్కారాల్లో గజ్వేల్ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ ఎంపికయ్యారు. గజ్వేల్ ప్రభుత్వాసుపత్రిలో రికార్డు స్థాయిలో అత్యధిక ప్రసవాలు నిర్వహించినందుకు గానూ ఆమెను ఉత్తమ గైనకాలజిస్ట్ మరియు ఉత్తమ డిసిహెచ్‌ఎస్ మెడికల్ సూపరింటెండెంట్ అవార్డులకు ప్రభుత్వం ఎంపిక చేశారు. ఈనెల 7వ తేదీన హైద్రాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంనరతి దామోదర్ రాజనర్సింహ చేతులమీదుగా ఈ పురస్కారాన్ని అందజేయనున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ ఈ పురస్కారం లభించడం వల్ల నాపై బాధ్యత మరింత పెరిగిందని, ఇది కేవలం నా ఒక్కరి కృషి కాదని, ఆసుపత్రిలో పనిచేసే ప్రతి ఒక్క వైద్యులది, సిబ్బంది కృషి ఉందన్నారు. వైద్య సేవలలో గజ్వేల్ ఆసుపత్రిని అగ్రగామిగా నిలిపినందుకు ప్రజలు, తోటి సిబ్బంది డాక్టర్ అన్నపూర్ణకు శుభాకాంక్షలు తెలిపారు.

ఆహార భద్రతపై అవగాహన పెంపొందించాలి

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి మున్సిపాలిటీ, ఏప్రిల్ 6 ప్రభాతవార్త : ఆహార భద్రతలో భాగంగా ప్రజలు ఆహార పదార్థాల కొనుగోలు సమయంలో నాణ్యత ప్రమాణాలను పరిశీలించి కొనుగోలు చేయాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం కలెక్టరేట్ సముదాయంలో జిల్లా ఆహార పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో అవగాహన సదస్సులు, లైసెన్స్ మేళా, ఫుడ్‌స్టాళ్లను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆహారంలో కల్తీలపై లైవ్ డెమోన్స్‌ట్రేషన్ నిర్వహించారు. కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్లో "పండ్లను కృత్రిమంగా పక్వం చేయుటకు సరైన మార్గం" అనే పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం కలెక్టరేట్ ఆడిటోరియంలో అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించి, వారికి సర్టిఫికెట్లు జారీచేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఆహార వ్యాపారులు లైసెన్సులు పొందుతూ, ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎక్కడైనా కల్తీ ఆహార పదార్థాలు ఉన్నట్లయితే తక్షణమే ఆహార భద్రత అధికారులకు ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 6 నుండి 11 వరకు ఆరోగ్య వారోత్సవం నిర్వహిస్తున్నదని తెలిపారు. ప్రజలు ఆహారసంబంధిత ఫిర్యాదుల కోసం 9908978790 / 9985600602 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు మాధురి, పాండు, సబ్ కలెక్టర్ ఉమా హారతి, రెవెన్యూ డివిజనల్ అధికారి రాజేందర్, ఫుడ్ సేఫ్టీ అధికారులు అమృత, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


స్టాల్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

రైతుల ఆదాయాన్ని పెంచడమే ప్రభుత్వ లక్ష్యం

తెలంగాణ రైజింగ్ 2045 లక్ష్యాలకు వ్యవసాయ శాఖ కీలకం.. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రామచంద్రాపురం, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:
ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ, ఇక్రిశాట్ ఆధ్వర్యంలో కొడంగల్ నియోజకవర్గానికి చెందిన యువ రైతులకు సాయిల్ హెల్త్ వలంటీర్లుగా రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం పట్టణంలోని ఇక్రిశాట్ వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించారు. కార్యక్రమానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ తరగతులను ప్రారంభించారు. కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని 8 మండలాలకు చెందిన ప్రతి గ్రామం నుంచి ఒక రైతును ఎంపిక చేసి సాయిల్ హెల్త్ వలంటీరుగా శిక్షణ అందిస్తున్నారు. శిక్షణలో భూసార పరీక్షలు, పంటల ఎంపిక, పంటల సరళి మార్పులు, వాతావరణ పరిస్థితుల ప్రభావం, అంతర్ పంటల సాగు, సేంద్రీయ వ్యవసాయం లాంటి అంశాలపై నిపుణులచే అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రైజింగ్ తెలంగాణ 2045 లక్ష్యాలకు అనుగుణంగా వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించడం, అగ్రిటెక్ వినియోగాన్ని ప్రోత్సాహించడం, లాభసాటి పంటలు, పంటల విలువ, వృద్ధి ద్వార రైతుల ఆదాయాన్ని పెంచడం ప్రభుత్వం ప్రధాన లక్ష్యంగా పెట్టుకుందన్నారు. వ్యవసాయ భూమి ఆరోగ్యంగా ఉంటేనే పంటల దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని, ఫలితంగా అన్నదాలు ఆర్థికంగా స్థిరపడతారన్నారు. శాస్త్రీయ పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం గ్రామీణ స్థాయికి చేరేలా వాలంటీర్లు తమ వంతు కృషి సల్పాలని సూచించారు. రసాయన ఎరువులను అధికంగా వినియోగించడంతో భూమి సరవంతత దెబ్బతింటుందన్నారు. పంటల మార్పిడితో భూసారం పెరుగుతుందన్నారు. రైతులు బయో ఫర్టిలైజరర్లు, సేంద్రీయ ఎరువులను వినియోగిస్తూ భూమి ఆరోగ్యంగా ఉంటేలా చూసుకోవాలన్నారు. అంతర్ పంటల సాగుతో అధిక ఆదయం పొందవచ్చన్నారు.

మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జానయ్య, కొండా లక్ష్మణ్ హార్టికల్చరల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ రాజిరెడ్డి, హార్టికల్చరల్ శాఖ డైరెక్టర్ షేక్ యాస్మిన్ భాషా, ఇక్రిసాట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ స్టాన్ఫోర్డ్ బ్లాడే, జడ్పీ సీఈఓ జానకిరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు

గజ్వేల్ బంద్ ప్రశాంతం

నిర్మానుష్యంగా మారిన రహదారులు.. ఆర్టీసీ డిపో ఎదుట నిరసన

గజ్వేల్, ఏప్రిల్ 6(ప్రభాతవార్త): గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై రెండురోజుల క్రితం కాంగ్రెస్ పార్టీ నాయకులు దాడి చేయడాన్ని నిరసిస్తూ బిఆర్ఎస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం నుండే వాణిజ్య వ్యాపారాలతో పాటు విద్యా సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపో వద్ద ఉదయం బిఆర్ఎస్ పార్టీ నేతలు బైఠాయించి నిరసన వ్యక్తంచేశారు. అలాగే గజ్వేల్‌లో పలు వీధుల్లో, రోడ్లపై ర్యాలీ నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బంద్ సందర్భంగా గజ్వేల్ నియోజకవర్గంలోని బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గజ్వేల్ పట్టణానికి పెద్దఎత్తున చేరుకొని బంద్‌కు సంఘీభావం తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావును విమర్శిస్తే సహించేదిలేదని, మరోసారి కాంగ్రెస్ పార్టీ నాయకులు పిచ్చిపిచ్చి చేష్టలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు గజ్వేల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేశారని, అలాంటి నాయకునిపై విమర్శలు చేస్తూ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై దాడికి యత్నించడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ నాయకులు గూండాల్లాగా ప్రవర్తిస్తున్నారని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం అసెంబ్లీలో మాట్లాడుతూ తన వెనుక రౌడీలు, గూండాలు ఉన్నారని బాహాటంగా చెప్పడంతో గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు రెచ్చిపోతున్నారని విమర్శించారు. బంద్ సందర్భంగా గజ్వేల్ ఏసిపి నర్సింలు ఆధ్వర్యంలో పోలీసులు భారీబందోబస్తు ఏర్పాటుచేశారు. ఎలాంటి అవాంఛ నీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగానే గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సి పాలిటీలో పికెటింగ్ నిర్వహించి బంద్‌ను ప్రశాంతంగా జరిగేలా చూశారు. పట్టణంలో మూడు రోజుల నుండి రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఈ బంద్‌లో గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

వేసవి తీవ్రతపై అప్రమత్తంగా ఉండాలి

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి మున్సిపాలిటీ, ఏప్రిల్ 6, ప్రభాతవార్త :
వేసవి కాలంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రజలు వడదెబ్బ బారినపడకుండా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. ప్రజల్లో అవగాహన పెంపొందించడం అత్యంత ప్రాధాన్యమని స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాలులో ఫిర్యాదుల స్వీకరణ అనంతరం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఈసారి సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నందున ముందుగానే చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా స్థాయిలో టాస్క్ ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతిరోజూ హీట్ వేవ్ ఉష్ణోగ్రతల నివేదికను జిల్లా అధికారుల గ్రూపులో షేర్ చేయాలని సీపీఓను ఆదేశించారు. కార్మికులు, సాధారణ ప్రజలు ఎండల వల్ల ఇబ్బందులు పడకుండా లేబర్ అడ్డాలు, పని ప్రదేశాల్లో తాగునీరు అందుబాటులో ఉంచాలని తెలిపారు. జిల్లాలోని అన్ని బస్తీ దవాఖానాలు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను సమృద్ధిగా నిల్వఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. అంగన్వాడీ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలు, గురుకులాలు, వసతి గృహాలలో కూడా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామపంచాయతీ కార్యాలయంలో 100-200 ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉండేలా చర్యలు చూసుకోవాలని పంచాయతీ సెక్రటరీలకు సూచనలు ఇవ్వాలని డీపీఓకు ఆదేశించారు.

వడదెబ్బ నివారణపై ఏం చేయాలి - ఏం చేయకూడదు" అనే అంశాలపై విస్తృత ప్రచారం చేయాలని, అన్ని సబ్ సెంటర్ల స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఆరోగ్య సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రజలకు సలహాలు అందించాలని సూచించారు. ప్రధానంగా వ్యవసాయ కూలీలు, ఉపాధి హామీ కార్మికులు, పరిశ్రమలలో పని చేసే వారు, భవన నిర్మాణ కార్మికులు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉన్నందున, వారికి అవసరమైన సదుపాయాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. పని ప్రదేశాలు, బస్టాండ్లు, పరిశ్రమల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు తమ పరిధిలో అవసరమైన చోట చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు ఉపశమనం కల్పించాలని సూచించారు. జిల్లాలో ఎక్కడా వడదెబ్బ వల్ల ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ ప్రావీణ్య కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు మాధురి, పాండు, సబ్ కలెక్టర్ ఉమా హారతి, జిల్లా అధికారులు, రెవిన్యూ డివిజనల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన జీవనానికి ఈట్ రైట్ వాక్

మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త: 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఆహార భద్రతపై ప్రత్యేక దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ సర్కిల్లో ఈట్ రైట్ వాక్ నిర్వహించగా, జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ సర్కిల్ నుండి రాందాస్ చౌరస్తా వరకు వాకింగ్ కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ డిపార్ట్‌మెంట్ డీఎస్పీ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియంత్రణపై పటిష్ట చర్యలు చేపట్టారు. ఈట్ రైట్ ఫైట్ డీసీజ్, హెల్త్, ఫుడ్‌సేఫ్టీ, సమన్వయంతో చేపట్టిన ఈకార్యక్రమంలో మున్సిపాలిటీ, ఎడ్యుకేషన్, ఫారెస్ట్, పోలీస్ స్పోర్ట్స్, ఇరిగేషన్, మత్స్యశాఖ, ఇండస్ట్రీస్ జిల్లా పరిషత్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. సరైన ఆహారం ఆరోగ్య భవిష్యత్తు, ప్లేకార్డులు చేత బూని నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తూ రాందాస్ చౌరస్తావరకు ర్యాలీ కొనసాగింది. రాందాస్ చౌరస్తాలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్ హెల్త్‌వీక్ కార్యక్రమంపై సుదీర్ఘంగా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళికఖీ 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈరోజు నుండి వారంరోజులపాటు హెల్త్‌వీక్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని ప్రజల్లో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ ర్యాలీని నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. శారీరక ఆరోగ్యం కోసం సమతుల్యమైన ఆహారం తీసుకోవడం ఎంతో అవసరమని, ఫాస్ట్ ఫుడ్‌కు దూరంగా ఉండి, పండ్లు, కూరగాయలు, ధాన్యాలు వంటి సహజ ఆహారాలను ఎక్కువగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా వివిధ విభాగాల్లో పనిచేసే ఉత్తమ వర్కర్‌లను గుర్తించి సత్కరిస్తున్నామన్నారు. ఏప్రిల్ 8న రక్షిత మాతృత్వదినోత్సవ కార్యక్రమంలో భాగంగా సురక్షిత ప్రసవాలపై అవగాహన కల్పించే కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. ఆరోగ్య ఉప కేంద్రాల్లో సమావేశాలు నిర్వహించి, పోషకాహారంపై విస్తృత ప్రచారం చేపడుతున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 9న ఎయిడ్స్ నియంత్రణపై రెడ్ రన్ ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా ట్రాన్స్‌జెండర్ వర్గాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆరోగ్య శిబిరాలను ఏర్పాటుచేయాలని తెలిపారు. తెలంగాణ సాంస్కృతిక కళాకారులచే ఎయిడ్స్ నివారణపై కళాజాతలు నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఏప్రిల్ 10న హోమియోపతి, ఆయుష్ దినోత్సవం సందర్భంగా కేజీబీవీల్లో, యోగా కేంద్రాల్లో యోగా సాధన చేయించాలని, అలాగే ఆయుష్‌పై ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఏప్రిల్ 11న మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, విద్యార్థులకు మత్తు పదార్థాల నివారణపై వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి, అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్, డిసిహెచ్ డాక్టర్ శివదయాల్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఎఫ్ఓ జోజి, డీఈఓ విజయ, బిడబ్ల్యూఓ హేమ భార్గవి, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసరావు, జిల్లా పరిశ్రమల అధికారి ప్రకాష్‌రావు, క్రీడల నిర్వహణ అధికారి రమేష్, మత్స్యశాఖ అధికారి, మున్సిపల్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఏఎన్ఎంలు, పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్

మంటలను ఆర్పుతున్న దృశ్యం

అడవికి నిప్పు..సకాలంలో స్పందించిన ఫారెస్ట్ అధికారులు

గుమ్మడిదల, ఏప్రిల్ 6 ప్రభాతవార్త : మండల పరిధిలో నల్లవల్లి అడవి, మేడాలమ్మ టెంపుల్ దగ్గర చోటుచేసుకున్న అగ్నిప్రమాదాన్ని ఫారెస్ట్ అధికారులు, సిబ్బంది సకాలంలో గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న వెంటనే అక్కడికి చేరుకున్న అటవీ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సెక్షన్ ఆఫీసర్ ఏఎల్ హుస్సేన్ మాట్లాడుతూ అడవులకు ఎలాంటి ప్రమాదం వాటిల్లకుండా చూడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. అడవిలో లేదా అడవి సమీపంలో ఎవరూ నిప్పు పెట్టే చర్యలు చేపట్టకూడదని హెచ్చరించారు. అలాగే రోడ్డు పక్కన కోతులకు తినేందుకు ఆహారం వేయడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని, అలాంటి పనులు చేయరాదని ప్రజలకు సూచించారు. ఫారెస్ట్ సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను అదుపులోకి తీసుకురావడంతో పెద్ద ప్రమాదం తప్పిందని ఆయన తెలిపారు. అడవులను రక్షి ంచేందుకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు.

ప్రియుడితో పరారైన భార్య.. హత్య చేసిన భర్త

జహీరాబాద్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త: వివాహేతర సంబంధం ఓ కుటుంబంలో కలతలు సృష్టించింది. ప్రియుడితో పరారైన భార్యను అవమానంతో హత్యచేసిన సంఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో సోమవారం చోటు చేసుకుంది. జహీరాబాద్ పోలీసుల కథనం ప్రకారం... పట్టణంలోని వెంకటరమణ కాలనీకి చెందిన పటేల్ సిద్దారెడ్డి సతీమణి కవిత (29) మార్చి 27వ తేదీన ఇంటి నుంచి ప్రియుడితో పారిపోయింది. భర్త సిద్దారెడ్డి మార్చి 30న పోలీసుకు ఫిర్యాదు చేయడంతో అదృశ్యం కేసుగా నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కాగా కవిత ప్రియుడు పవన్‌రెడ్డితో కలసి జడ్చర్లలో ఉన్నట్లు తెలుసుకుని తీసుకొచ్చేందుకు భర్త సిద్దారెడ్డితో కలిసి పోలీసులు జడ్చర్లకు చేరుకున్నారు. అక్కడ పవన్‌రెడ్డితో ఉన్న కవితను కారులో ఎక్కించుకుని జహీరాబాద్‌కు వస్తున్న క్రమంలో మార్గమధ్యలో సదాశివపేట మండలం నందికందివద్ద అప్పటికే కోపంతో ఉన్న సిద్దారెడ్డి కత్తితో కవిత గొంతుపై దాడి చేశాడు. దీంతో కవిత తీవ్ర గాయాలకు గురికావడంతో పోలీసులు చికిత్స నిమిత్తం జహీరాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించగా కవిత మృతి చెందిందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి కవితను హత్య చేసిన సిద్దారెడ్డిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

యువకుడి ఆత్మహత్య

బెజ్జంకి, ఏప్రిల్ 6, ప్రభాతవార్త : మండల పరిధిలోని వీరాపూర్‌లో యువకుడు ఆత్మహత్మ చేసుకున్న సంఘటన వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మారు భాగ్యరెడ్డి(34) గతంలో లండన్‌లో ఉద్యోగం చేసి కరోనా అనంతరం భారత్‌కు వచ్చినట్లు తెలిపారు. బెంగళూరు, పూణేలో కొంత కాలం పని చేసినప్పటికీ రెండు నెలలుగా నిరుద్యోగంతో మానసికంగా బాధపడుతూ ఇంటి వద్దే ఉంటున్నట్లు తెలిపారు. ఆదివారం సాయంత్రం తండ్రితో కలిసి పొలానికి వెళ్లిన అనంతరం ఇంటికి తిరిగి రాకపోవడంతో సోమవారం ఉదయం పొలం సమీపంలోని బావిలో మృతదేహంగా గుర్తించినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. నిరుద్యోగం కారణంగా మానసిక ఆందోళనకు గురై ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమికంగా తెలిసిందని ఎస్ఐ బోయిని సౌజన్య తెలపారు.

ఇసుక అక్రమ రవాణాపై పోలీసుల దాడులు

రెండు ట్రాక్టర్ల సీజ్

ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేసిన దృశ్యం

కోహెడ, ఏప్రిల్ 6, ప్రభాతవార్త : మండల పరిధిలోని కూరెల్లా గ్రామ శివారులోని మోయతుమ్మెద వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో కోహెడ పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. వాగులో ఇసుకతో లోడ్ చేసిన రెండు ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టిఎస్01ఈహెచ్-6256, ఎపి 36 ఎవి 1109 నంబరుగల ట్రాక్టర్లను ఇసుక తరలిస్తుండగా సీజ్‌చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇసుక తరలిస్తున్న నిందితులపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. మండలంలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తే సహించేదిలేదన ఎస్ఐ అభిలాష్ హెచ్చరించారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చట్ట రీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

జాతీయ రహదారిపై జింక మృతి

చౌటకూరు, ఏప్రిల్ 6, ప్రభాతవార్త: మండల పరిధిలోని సుల్తాన్‌పూర్ గ్రామ శివారులో 161వ జాతీయ రహదారిపై జింతక మృతి చెందింది. గ్రామం సమీపంలోని డీఎస్ దాబా ఎదురుగా పెద్ద చెరువు వైపు వచ్చి రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొని జింక మృతి చెంది ఉంటుందని అటవీశాఖ సిబ్బంది భావిస్తున్నారు. రెండు రోజుల క్రితమే జింక మృతి చెంది ఉంటుందని, అందుకే జితక కళేబారం ఉబ్బి పోయిందని సిబ్బంది అంటున్నారు. గత కొంత కాలంగా జింకలు, లేళ్లు, దుప్పిలు గణనీయ సంఖ్యలో సంచరిస్తున్నాయి. మృతి చెందిన జింకను మండల పశువైద్యాధికారరి డాక్టర్ విశాల్ పరిశీలించి పోస్టుమార్టం నిర్వహించి జాతీయ రహదారి పక్కనే అంతక్రియలు నిర్వహించారు. ఉప్పరిగూడెం, బొమ్మారెడ్డిగూడెం, గొంగ్లూర్ పరిసర ప్రాంతాల్లో రిజర్వ్ ఫారెస్ట్ ఉండటంతో తరుచుగా మూగజీవాలు అటుగా సంచరిస్తూ రోడ్డు ప్రమాదానికి గురవుతున్నాయి.


మృతి చెందిన జింకను పరిశీలిస్తున్న అధికారుల

కరెన్సీ నోట్లపై అంబేద్కర్ బొమ్మ ముద్రించాలి : రామకృష్ణ

కరెన్సీ పై అంబేద్కర్ బొమ్మ ముద్రించాలని ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థి జెఏసి చైర్మన్ వేముల రామకృష్ణ

హైదరాబాద్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త

కరెన్సీ నోట్లపై అంబేద్కర్ బొమ్మ ముద్రించాలి తెలంగాణ విద్యార్థి జెఏసి చైర్మన్ వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం ఆర్బీఐ సృష్టికర్త, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఫోటో కరెన్సీ నోట్లపై ముద్రించాలని డిమాండ్ చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ మొదటి ప్రపంచ యుద్ధంలో బ్రిటిష్ పాలనలో భారతదేశ ఆర్థిక సంక్షోభాని కి గురైంది, దీని నుంచి బయటపడేందుకు ఇంపీరియల్ బ్యాంక్ 1921ను అది విఫల ప్రయత్నం గానే మిగిలిపోయిందన్నారు.ఆ సమయంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ క్షీణిస్తున్న రూపాయి విలువను గురించి దీనివల్ల సామాన్యుడి జీవనం దుర్భరమవుతున్న సమయంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. అంబేద్కర్ సూచనలను క్రోడీకరించి ఆర్బీఐ చట్టం 1934,1949లో బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టం ద్వారా రిజర్వ్ బ్యాంకును జాతీయం చేశారన్నారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థ పతనం అవుతున్న సమయంలో గట్టెక్కించిన మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గనుక కరెన్సీ నోట్లపై అంబేద్కర్ బొమ్మ ముద్రించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, మహేందర్, బాలకృష్ణ, చరణ్, అంజి, రాజు,కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కెపిహెచ్‌బి టెంపుల్ బస్ స్టాప్‌లో మజ్జిగ పంపిణీ

మజ్జిగ పంపిణీ చేస్తున్న రంగ మోహన్

కెపిహెచ్‌బి కాలనీ, ఏప్రిల్ 6, ప్రభాతవార్త

కెపిహెచ్బి కాలనీ టెంపుల్ బస్ స్టాప్‌లో ఉన్న ఎస్.కె డి.కె. వై చలివేంద్రం దగ్గర కాంగ్రెస్ పార్టీ నాయకులు మోటేపల్లి రంగ మోహన్ సౌజన్యంతో సోమవారం మజ్జిగ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా రంగ మోహన్ మాట్లాడుతూ సమాజ సేవ ప్రజలకు దగ్గరయ్యే ఓ మార్గం మాత్రమే కాదని, ఎండ తీవ్రత దృష్ట్యా బాటసారులెందరికో ఉపశమనం కల్గించిన తృప్తి మిగులుతుందని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వారియర్ పిడికిటి గోపాల్ చౌదరి, తుమ్మల మోహన్ కుమార్, వెంకట్, వీరబాబు, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

భారత్‌ను విశ్వగురువుగా నిలిపేందుకు బిజెపి కృషి

- రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు నీరుడు శేఖర్ ముదిరాజ్

కిస్మత్‌పూర్ డివిజన్‌లో బిజెపి ఆవిర్భావ దినోత్సవంను జరుపుకుంటున్న ఆ పార్టీ నేతలు నీరుడు శేఖర్ ముదిరాజ్ తదితరులు.

నార్సింగి, ఏప్రిల్ 6 ప్రభాతవార్త : భారతదేశంను విశ్వగురువుగా నిలిపేందుకు భారతీయ జనతా పార్టీ అహరహము కృషి చేస్తుందని బిజెపి రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు నీరుడు శేఖర్ ముదిరాజ్ పేర్కొన్నారు. సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ కిస్మత్‌పూర్ డివిజన్‌లో బిజెపి 47.వ, ఆవిర్భావ దినోత్సవంను నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా శేఖర్ ముదిరాజ్ మాట్లాడుతూ దేశ అభ్యున్నతి కోసం, దేశ ప్రజల సంక్షేమం కోసం బిజెపి నిరంతరం కష్టపడుతుందన్నారు. దేశ క్షేమం కోసం యువతలో జాతీయతా భావాలను పెంచుతున్నామన్నారు. దేశభక్తి, అభివృద్ధి, పారదర్శక పరిపాలన అనే మూడు సిద్ధాంతాలను అనుసరిస్తూ బీజేపీ దేశంలోని కోట్లాది మంది మన్ననను పొందుతుందన్నారు. గత 47.ఏళ్ల కాలంలో బిజెపి అనేక ఉత్థాన, పాతానాలను చూసిం దని అన్నింటిని తట్టుకొని సగర్వంగా నిలిచిందని, దేశ ప్రజల హృదయాలలో కొలువై ఉందని శేఖర్ ముదిరాజ్ పేర్కొన్నారు. ఇక నుంచి జరిగే ఏ ఎన్నికైనా రాజేంద్ర నగర్ నియోజకవర్గంలో బిజెపి అభ్యర్థులే విజయం సాధిస్తారని, ఇలా నాయకులంతా ప్రజలతో మమేకమై పని చేస్తారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్ నాయక్, పవన్ సాయి, శ్రీనివాస్‌రెడ్డి, నరినసంగ్‌రావ్, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్, స్వామి, ప్రవీణ్‌గౌడ్, సాయిరెడ్డి, వెంకటేష్, నరినసంగ్‌రావ్, పవన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజలకు తిప్పలు : ఎమ్మెల్యే కృష్ణారావు

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కెపిహెచ్‌బి కాలనీ, ఏప్రిల్ 6, ప్రభాతవార్త

అధికార ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కూకట్‌పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు ఆరోపించారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో బిఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, సెక్రటరీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో ముందుకు వెళుతూ ఇబ్బందులపాలు చేస్తుందని ప్రధానంగా ప్రజలు దోమలు, మంచినీరు అస్తవ్యస్త రోడ్లతో ఇబ్బందులు పాలవుతున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సమస్యలకు సంబంధించి ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులకు ఆ సమస్యను తెలియపరిచి వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక ప్రజలకు ఏమైనా ఇబ్బంది ఉన్నయెడల తనను సంప్రదించాలని తెలిపారు. గత పది ఏళ్ల కాలంలో కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేసుకున్నామని జరిగిన అభివృద్ధి పనులను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని పార్కులు ఓపెన్ జిమ్‌లు అస్తవ్యస్తంగా తయారయ్యాయని పార్కుల్లో కనీసం మౌలిక సదుపాయాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకని ప్రజల్లో తిరుగుతూ వారి సమస్యలను పరిష్కరించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వంతో పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బిజెపి ఆవిర్భావ దినోత్సవం

అల్వాల్‌లో బిజెపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా విష్కరణలో నేతలు

సుభాష్‌రోడ్డులో బీజేపీ జెండా ఆవిష్కరిస్తున్న బీజేపీ తెలంగాణా రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు బీరె శ్రీకాంత్.

పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాశం సురేందర్

బిజెపి 46వ ఆవిర్భావ దినోత్సవం కూకట్‌పల్లిలో సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు

సంజీవరెడ్డి నగర్‌లో నిర్వహించిన బిజెపి ఆవిర్భావ దినోత్సవం వేడుకల్లో పాల్గొన్న బిజెపి పార్టీ శ్రేణులు

తార్నాక క్రాస్ రోడ్స్ వద్ద బిజెపి పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు

ఘాన్సీ బజార్‌లో జరిగిన బిజెపి వ్యవస్థాపక దినోత్సవంలో పాల్గొన్న డివిజన్ బిజెపి అధ్యక్షులు నితిన్ అగర్వాల్,బిజెపి నాయకులు

బిజెపి 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న డాక్టర్ చికోటి ప్రవీణ్

ముగిసిన ఖేలో ఇండియా సైక్లింగ్ పోటీలు

విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

ఎల్.బి.నగర్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త: సైక్లింగ్ పోటీలో 20 రాష్ట్రాలకు చెందిన మహిళ క్రీడాకారిణులు పాల్గొని హోరాహోరీగా పోటీపడ్డారు. క్రీడా రంగంలో మహిళలకు ప్రోత్సాహం అందించే దిశగా నిర్వహిస్తున్న అస్మిత ఖేలో ఇండియా ఉమెన్స్ నేషనల్ సైక్లింగ్ లీగ్ పోటీలను నాగోల్ డివిజన్ బండ్లగూడలో సోమవారం విజయవంతంగా ముగిశాయి.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన టీపీసీసీ ప్రధానకార్యదర్శి, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లను, బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడానికి పోటీలు నిరంతరం నిర్వహించాలన్నారు. మహిళలు క్రీడల్లో ముందుకు రావడం వారిలోని ప్రతిభకు పదును పెట్టిన వారవుతారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ క్రీడాకారులకు అండగా నిలిచి ప్రోత్సహిస్తుందన్నారు. ఈ సైక్లింగ్ పోటీల్లో 20 రాష్ట్రాల నుండి (సౌత్, ఈస్ట్, వెస్ట్, నార్త్) బాలికలు సబ్‌జూనియర్, జూనియర్, ఎలైట్ విభాగాల్లో 120 మహిళలు ఉత్సాహంగా పాల్గొనడం పట్ల అభినందించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు క్రీడాకారులకు ప్రోత్సాహ బహుమతులను అందజేసి వారిని మరింత ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంజీవ రెడ్డి, శంతన్, సెంట్రల్ వాటర్ బోర్డ్ రీజనల్ డైరెక్టర్ నల్లి జ్యోతికుమార్, వోబులేశ్ యాదయ్య, మేజర్ జనరల్ శ్రీనివాస్, నిర్వహకులు డాక్టర్ మాక్స్వెల్ శ్రీకాంత్, పాష శ్రీకాంత్, వివిధ రాష్ట్రాలకు చెందిన పలువురు క్రీడా ప్రముఖులు, నాయకులు, క్రీడాకారిణులు కోచ్‌లు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో వాణిజ్య సముదాయాల వేలం ఆపాలి : సిపిఎం జిల్లా కార్యదర్శి పి. సత్యం

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను సందర్శిస్తున్న నాయకులు

దుండిగల్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త

మెద్చల్-మల్కాజిగిరి జిల్లాలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో ఉన్న వాణిజ్య సముదాయాలను వేలం వేయొద్దని సిపిఎం జిల్లా కార్యదర్శి పి. సత్యం డిమాండ్ చేశారు. ఈ సముదాయాలను స్థానిక నివాసితులకే కేటాయించాలని కోరారు. సోమవారంసిపిఎం ఆధ్వర్యంలో దుండిగల్, డి. పోచంపల్లి ప్రాంతాల్లోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పార్టీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. డబుల్ బెడ్ రూమ్ కాలనీల్లో నివసిస్తున్న ప్రజలు అనేక మౌలిక సదుపాయాల సమస్యలను ఎదుర్కొంటున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ గత ప్రభుత్వం ఈ ఇండ్ల నిర్వహణ కోసం వాణిజ్య సముదాయాలను ఏర్పాటు చేసిందని, వాటి ద్వారా వచ్చే ఆదాయం లిఫ్టులు, ఇతర సౌకర్యాల నిర్వహణకు ఉపయోగపడాలని తెలిపారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఈ సముదాయాలను వేలం వేయాలని ప్రయత్నించడం తప్పు అని విమర్శించారు.వేలంపాటను తక్షణమే నిలిపివేయాలని, లేదంటే ప్రజలను సమీకరించి పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఇప్పటికే కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా, చలో అసెంబ్లీ కార్యక్రమాలు నిర్వహించి, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు.అదేవిధంగా డబుల్ బెడ్ రూమ్ కాలనీల్లో మంచినీటి సమస్య పరిష్కారం, వీధి దీపాలు, డ్రైనేజీ వ్యవస్థ, అంగన్వాడి కేంద్రం, ప్రభుత్వ పాఠశాల, ఆసుపత్రి ఏర్పాటు చేయాలని, జీరో కరెంట్ బిల్లు అమలు చేయాలని, స్మశానవాటిక ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు అశోక్, రాజశేఖర్, శంకర్, లింగస్వామి, సంతోష్ తదితరులు, అలాగే స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఇందిరాపార్కులో సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు : మంత్రి దామోదరం రాజనర్సింహ

ఇందిరాపార్కును సందర్శించిన వైద్య ఆరోగ్యశాఖామంత్రి దామోదరం రాజనర్సింహ

ముషీరాబాద్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త: ఇందిరాపార్కులో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటానని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాకా మంత్రి దామోదరం రాజనర్సింహ స్పష్టం చేశారు. సోమవారం నెక్లెస్‌రోడ్డులో ఒక కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి అక్కడ నుంచి లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని వినాయక దేవాలయంకు వచ్చి, అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇందిరాపార్కును మంత్రిగా కాకుండా ఒక సాధారణ వ్యక్తిగా సందర్శించిన రాజనర్సింహ, అక్కడ ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేశారు. ఈ సందర్భంగా ఇందిరాపార్కు వాకర్స్ పార్కులో ఉన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. పార్కులో మరుగుదొడ్లు, మంచినీరు, ఓపెన్ జిమ్ పరికరాల రిపేర్ వంటి సమస్యలు పరిష్కరించాలని వాకర్స్, మంత్రిని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి జోనల్ కమీషనర్ మంగతాయారుకు ఫోన్‌చేసి, పార్కులో సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ఆసియాఖండంలోనే అతి పెద్ద పార్కులలో ఒక్కటైన ఇందిరాపార్కుకి ప్రతినిత్యం వేలాది మంది వాకర్స్, వాకింగ్ చేస్తూ ఉంటారని, వారికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యం మానసిక ప్రశాంతత కోసం ప్రతి ఒక్కరూ వాకింగ్‌తో పాటు వ్యాయామం చేయటం జీవితంలో భాగం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇందిరాపార్కు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఏ.సుధాకర్ యాదవ్, సభ్యులు నరేందర్, జయేందర్ బాబు, శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

జస్టిస్ చంద్రకుమార్ రచనలు చైతన్యప్రవాహాలు! : పద్మశ్రీ కొలకలూరి ఇనాక్

జస్టిస్ చంద్ర కుమార్ రచించిన గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య కొలకలూరి ఇనాక్

చిక్కడపల్లి ఏప్రిల్ 6,ప్రభాతవార్త : హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి. చంద్రకుమార్ రచనలు ప్రజాచైతన్య ప్రవాహాలని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ పేర్కొన్నారు. సోమవారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ కవి కళారత్న డా. బిక్కి కృష్ణ అధ్యక్షతన జస్టిస్ బి. చంద్రకుమార్ రాసిన "అమ్మకావాలినాన్న కావాలి" నవలావిష్కరణ సభ జరిగింది.ఈ సభలో ఆచార్య కొలకలూరి ఇనాక్ ముఖ్య అతిథిగా పాల్గొని నవలను ఆవిష్కరించారు. భారతీయ కుటుంబ వ్యవస్థ గొప్పదనాన్ని, విడాకులవల్ల భార్యాభర్తలతో పాటు వారిపిల్లలు పడే మానసిక వేదనను రచయిత వేదనతో నవలగా శిల్పీకరించారని తెలిపారు. తెలుగు నవలా సాహిత్యంలో ఇదో గొప్ప నవలని ఇనాక్ కితాబిచ్చారు. న్యాయమూర్తిగా సంచలనాత్మక తీర్పులిచ్చిన జస్టిస్ బి. చంద్రకుమార్.. వృత్తి అనుభవ నేపథ్యంలో సజీవపాత్రలను సృష్టించి నవలను ఒక స్ఫూర్తివంతమైన కళాఖండంగా తీర్చి దిద్దారని వక్తలు కొనియాడారు. ఈ సభలో అతిథులుగా ప్రముఖ రచయితలు కె. వి. కృష్ణకుమారి, డా. పి. విజయలక్ష్మి పండిట్, డా. జెల్ది విద్యాధర్, డా. కోగంటి ఉషారాణి, డా. రాధాకుసుమ తదితరులు పాల్గొన్నారు. రచయిత జసిస్ బి. చంద్రకుమార్ మాట్లాడుతూ.. ఉమ్మడి కుటుంబాల వ్యవస్థ ధ్వంసమై.. అవగాహనా రాహిత్యంతో సమాజంలో విడాకుల కేసులు పెరుగుతున్నాయని.. కుటుంబవ్యవస్థను ఎలా కాపాడుకోవాలో "అమ్మకావాలానాన్న కావాలా"నవలలో చిత్రించ డం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా డా. రాధా కుసుమ నిర్వహణలో జరిగిన కవిసమ్మేళనంలో నలభైమంది కవులు పాల్గొని తమ కవితలు వినిపించారు.

ఐదు దశాబ్దాల ఎర్రజెండా ప్రస్థానం లోకం పద్మ భాస్కరరావు

లోకం పద్మ , భాస్కరరావు దంపతులను సత్కరిస్తున్న ప్రముఖులు

చిక్కడపల్లి ఏప్రిల్ 6 (ప్రభాతవార్త) : ఆదర్శవంతమైన దాంపత్యం.. దానికి తోడు ఐదు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ, సామాజిక ప్రస్థానం.. అభ్యుదయ భావజాల వ్యాప్తి కోసం అంకితమైన జీవితం.. ఇదీ లోకం పద్మ భాస్కర రావు దంపతుల ప్రత్యేకత అని పలువురు వక్తలు కొనియాడారు. సోమవారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎర్రజెండా నీడలో యాభై ఏళ్లు శీర్షికన నిర్వహించిన ఆత్మీయ సన్మాన సభ ఆరాధన కల్చరల్ అసోసియేషన్ , విశాలాంధ్ర, నవచేతన ఆధ్వర్యంలో జరిగింది. ఈ సభకు సోమశిల తిరుపాల్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సభలో పాల్గొన్న తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కందిమళ్ల ప్రతాపరెడ్డి , లోకం కృష్ణయ్య ,మాట్లాడుతూ కేవలం కుటుంబం కోసమే కాకుండా సమాజం కోసం బతికేవారే నిజమైన కమ్యూనిస్టులని, దానికి పద్మభాస్కరరావు దంపతులు నిదర్శనమని పేర్కొన్నారు.అనంతరం నిర్వాహకులు లోకం పద్మ భాస్కరరావు దంపతులను శాలువాలతో కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పి. రాజేశ్వరరావు, గోలి సీతారామయ్య, ఎస్. రాజా, పి. నారాయణ రెడ్డి, కనపర్తి బెన్ హర్, పల్లె నరసింహ, ఎస్. రామారావు, దేవరకొండ శ్రీను తదితర ప్రముఖులు పాల్గొని దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమ నిర్వహణ బాధ్యతలను శివశంకర్ పర్యవేక్షించగా, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు, పుస్తక ప్రేమికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

దళిత సమాజ సాధికారతకు కృషి చేసిన దార్శనికుడు జగ్జీవన్‌రాం

జూబ్లీహిల్స్, ఎప్రిల్ 6, ప్రభాతవార్తః

దళిత సమాజ సాధికారతకు, అభ్యున్నతి కోసం అవిశ్రాంతంగా కృషి చేసిన గొప్ప దార్శనికుడు బాబు జగ్జీవన్‌రాం అని అంబేద్కర్ వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి అన్నారు. వర్సిటీ ప్రాంగణంలో సోమవారం 'ఆధునిక భారత దేశ అభివృద్ధిలో జగ్జీవన్‌రాం పాత్ర' అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయం, అణగారిన వర్గాల హక్కుల కోసం, సమాన గౌరవం దక్కేలా తన జీవితాన్ని పోరాటాలకే అంకితం చేసిన నాయకుడని అన్నారు. దేశ అభివృద్ధికి ఆయన తీసుకున్న నిర్ణయాలు నాందిగా నిలిచాయన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య చింతకింది ఖాసీం మాట్లాడుతూ జగ్జీవన్‌రాం అనేక అవమానాలను ఎదుర్కొంటూ వాటిపై పోరాటాలు చేస్తూ ప్రజలను సంఘటితం చేసిన మహోన్నత వ్యక్తని అన్నారు. ఆయన ఆధునిక భారత రాజకీయాల స్వర్ణయుగానికి చెందినవారని, జాతీయ నాయకుడిగా, గొప్ప పార్లమెంటేరియన్‌గా, కేంద్ర మంత్రిగా అర్ధ శతాబ్దం పాటు ఆయన దేశ రాజకీయాల్లో కొనసాగారన్నారు.

కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్వీకే రెడ్డి, ఎస్సీ ఎస్టీ సెల్ లైసన్ ఆఫీసర్ డాక్టర్ బానోతు ధర్మ, ఆచార్య సుధారాణి, ఆచార్య ఆనంద్‌పవార్, ఆచార్య రబీంద్రనాథ్ సోలమన్, ఆచార్య పల్లవి, ఆచార్య వడ్డాణం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రామచందర్ రావును కలిసిన బిజెపి నాయకులు

రాష్ట్ర బిజెపి అధ్యక్షులు ఎన్.రామచందర్ రావును సత్కరిస్తున్న బిజెపి నాయకులు

చార్మినార్,ఏప్రిల్ 6 ప్రభాతవార్త :

బిజెపి 47వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర బిజెపి అధ్యక్షులు ఎన్.రామచందర్ రావును సోమవారం పాతబస్తీకి చెందిన మాజీ బిజెపి మైనార్టీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీతో పాటు పలువురు కలిసి సత్కరించారు.ఈ కార్యక్రమంలో మైనార్టీ మోర్చ అధ్యక్షుడు జగన్ మోహన్ సింగ్, నాయకులు డాక్టర్ వసీముద్దీన్,వి.మురళీధర్ గౌడ్,షాబాజ్ పటేల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఆందోళన - చర్యలు కోరిన ఆకుల సతీష్

నిజాంపేట్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త

మెద్చల్-మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని ఆకుల సతీష్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేశారు.నిజాంపేట్ పరిధిలోని సర్వే నెం. 233/22, 24, 25, 26, 27లో సుమారు 14 ఎకరాల లావణ్య పట్టా భూమిని 1964-65లో రైతులకు కేటాయించగా, తరువాత ఎన్‌వోసీ లేకుండా 2008లో వెంచర్‌గా మార్చి ప్లాట్లుగా విక్రయించినట్లు తెలిపారు. ఈ వ్యవహారంపై 2010లో కలెక్టర్ భూమి మార్పులను రద్దు చేసినప్పటికీ, ప్రస్తుతం కొందరు వ్యక్తులు మళ్లీ ఆక్రమణకు పాల్పడుతూ నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు.ఇక ప్రగతి నగర్‌లోని సర్వే నెం. 186లో ప్రభుత్వ భూమిని వేరే సర్వే నెంబర్‌గా చూపించి అక్రమ రిజిస్ట్రేషన్లు చేసినట్లు, నిర్మాణ అనుమతులు కూడా పొందినట్లు పేర్కొన్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని విమర్శించారు.ఈ నేపథ్యంలో ఆక్రమణలను వెంటనే అడ్డుకోవాలని, హైకోర్టులో అప్పీల్ వేయాలని, భూములను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని ప్రజాప్రయోజనాలకు వినియోగించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆకుల సతీష్ డిమాండ్ చేశారు.

ఆసుపత్రి నిర్మాణానికి స్థలాన్ని కేటాయించండి

ఎమ్మార్వో అనితారెడ్డికి వినతిపత్రం అందిస్తున్న మన్నె గోవర్ధన్‌రెడ్డి.

జూబ్లీహిల్స్, ఎప్రిల్ 6, ప్రభాతవార్తః

జూబ్లీహిల్స్ డివిజన్ ఇందిరానగర్‌లో రూ. 1.43కోట్ల వ్యయంతో నూతన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని జీహెచ్‌ఎంసీకి కేటాయించాలని షేక్‌పేట తహసిల్దార్ అనితారెడ్డిని ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇంఛార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి వినతిపత్రం అందించారు. వినతి పత్రాన్ని స్వీకరించిన ఎమ్మార్వో స్పందిస్తూ భూసర్వే, పంచనామా, స్కెచ్ రిపోర్ట్ సిద్ధం చేసి జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులకు నివేదికను అందించామన్నారు. అవసరమైన అన్ని ప్రక్రియలను త్వరితగతిన తమవైపు నుంచి పూర్తి చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు శంకర్, శౌరిరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సహాయం..



సహాయం అందజేస్తున్న దృశ్యం

నిజాంపేట్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త

హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం దాత రిటైర్డ్ ఏడిఈ, విద్యుత్ శాఖ, కొల్లి జీవన్ బాబు వారి సహకారంతో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుతున్న దూసి హర్షితకు రూ. 10,000 ఆర్థిక సహాయం అందజేసినట్లు ట్రస్ట్ అధ్యక్షులు మూడే రవి నాయక్ తెలిపారు. విద్యుత్ శాఖలో ఏడిఈగా పనిచేసి గత నెల మార్చిలో పదవీ విరమణ పొందిన కొల్లి జీవన్ బాబు, తన కుటుంబ సభ్యులు జయసునందతో కలిసి సోమవారం హర్షితకు రూ. 10,000 చెక్కును అందజేశారు. దూసి శ్రీనివాస్ అపార్ట్మెంట్‌లో వాచ్మెన్‌గా పనిచేస్తూ తన కుమార్తె హర్షిత విద్యను కొనసాగించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటు న్న నేపథ్యంలో, ట్రస్ట్ గతంలో కూడా రూ. 10,000 ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. ఈ సంవత్సరం కూడా అదే విధంగా సహాయం అందించడం జరిగిందని వెల్లడిం చారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ మూడే లక్ష్మీదేవి పాల్గొన్నారు.

దొంగతనం కేసులో పాత నేరస్తుడి అరెస్ట్

ఎల్.బి.నగర్ ఏప్రిల్ 6 ప్రభాతవార్త: ఇంట్లో చొరబడి దొంగతనాలకు పాల్పడుతున్న ఓ నేరస్తుల్ని పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నాగోల్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ తెలిపిన వివరాల ప్రకారం..ఈ నెల 4వ తేదీ అర్ధరాత్రి నాగోల్ డివిజన్ సాయినగర్ లలితనగర్‌కు చెందిన కొమ్మెర నవీన్ (20)అనే యువకుడు నాగోల్‌లోని ఎకోపాలిట్ అపార్ట్‌మెంట్ నాల్గవ బ్లాక్, ఐదవ అంతస్తులో నివసిస్తున్న రమాకాంత్ కౌశిక్ ఇంట్లోని కిటికీ గ్రిల్ తొలగించి ఇంట్లోకి చొరబడ్డాడు. కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న సమయంలో మరో బెడ్‌రూమ్‌లోని కబోర్డ్‌లో ఉన్న రమాకాంత్ కౌశిక్ తల్లికి చెందిన సుమారు పదిన్నర తులాల బంగారు నగలు, ఒక నెక్లెస్, రెండు లాంగ్ చైన్లు, ఒక బ్లాక్ బీడ్స్ చైన్, గాజులు, ఉంగరాలతో పాటు హెచ్ ల్యాప్‌టాప్‌ను దొంగిలించాడు. అలాగే ఒక యాక్టీవా బైక్‌ను కూడా అపహరించాడు.బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీటీవీ ఫుటేజీలను వివిధ కోణాల్లో పరిశీలించి నిందితుడిని గుర్తించారు. అనంతరం అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నాడు.దొంగిలించిన నగలు, ల్యాప్‌టాప్, యాక్టీవా బైక్‌ను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడిపై నాగోల్, హయత్‌నగర్, సరూర్ నగర్ పోలీస్ స్టేషన్లలో గతంలో కూడా కేసులు ఉన్నాయని, ఇటీవలే జైలు నుంచి విడుదలై మళ్లీ దొంగతనానికి పాల్పడినట్లు సీఐ తెలిపారు.కేసును చాకచక్యంగా ఛేదించిన డీఐ రుద్వీర్, డీఎస్ఐ నరసింహ, కానిస్టేబుళ్లు సుభాష్, సాయిష్, క్రైమ్ రైటర్ మౌనికలను సీఐ అభినందించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

జూబ్లీహిల్స్ ఏప్రిల్ 6, ప్రభాతవార్తః

బంజారాహిల్స్‌లో గుర్తుతెలియని ఒక వ్యక్తి మృతిచెందాడు. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ ఠాణా పరిధిలోని ఇందిరానగర్ అమృతబార్ పక్కన ఒక గుర్తుతెలియని వ్యక్తి అచేతనంగా పడి ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు 108 సిబ్బంది ద్వారా అతన్ని పరిశీలించగా అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. ఎవరైనా ఇతన్ని గుర్తిస్తే తమను 8712660454 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఫ్రిజ్‌లో 80 బిర్యానీ ప్యాకెట్లను సీజ్ చేసిన పోలీసులు

జూబ్లీహిల్స్, ఎప్రిల్ 6, ప్రభాతవార్తః

ఆదివారమని బిర్యానీ తిందామని జొమాటోలో ఆర్డర్ పెట్టాడు. బిర్యానీ నోట్లో పెట్టే సమయంలో దుర్వాసన వచ్చింది. అంతే.. ఆర్డర్ చేసిన వ్యక్తి ఏకంగా బిర్యానీ విక్రయించే ప్రాంతానికి వెళ్లాడు. బంజారాహిల్స్ పోలీసులతో కలిసి బిర్యానీ పంపే ప్రాంతానికి వెళ్లారు. అక్కడ సీనన చూసిన కస్టమర్‌తో పాటు పోలీసులు ఒక్కసారిగా కంగుతిన్నారు. ఫ్రిజ్‌లో పెట్టిన బిర్యానీ ప్యాకెట్లతోపాటు మరో ఫ్రిజ్‌లో ఎలుకలు తిరగడాన్ని గుర్తించారు. దీంతో ఆయా ప్రాంతాన్ని పోలీసులు సీజ్ చేశారు. బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ సుహాసన్ కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నంబరు 2లో నివసించే కొండారెడ్డి ఆదివారం జొమాటోలో లక్కీ బిర్యానీ అండ్ షవర్మ ద్వారా బిర్యానీ ఆర్డర్ చేశారు. బిర్యానీ వాసన రావడంతో డెలివరీ బాయ్‌కు ఫోన్ చేసి బంజారాహిల్స్ రోడ్ నంబరు 2 నుంచి బిర్యానీ తీసుకొచ్చినట్లు గుర్తించి నేరుగా అక్కడికి వెళ్లాడు. బంజారాహిల్స్ పోలీసులకు సమాచారం అందించాడు. కాగా బిర్యానీ జీడిమెట్లతో తయారుచేసి బంజారాహిల్స్ రోడ్ నంబరు 2లో తీసుకొన్న ఒక గదిలోని ఫ్రిజ్‌లో పెట్టి విక్రయిస్తున్నట్లు వారు గుర్తించారు. మొత్తం 80 బిర్యానీ ప్యాకెట్లను పోలీసులు గుర్తించారు. అలాగే పక్కనే ఉన్న మరో ఫ్రిజ్‌లో ఎలుకలు తిరుగుతుండటాన్ని పోలీసులు గుర్తించారు. ఇవన్నీ గమనించిన వారు ఒక్కసారిగా కంగుతిన్నారు. ఎవరైనా బిర్యానీ ఆర్డర్ చేస్తే ఓవెన్‌లో పెట్టి వేడి చేసి పంపుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు యజమాని ఇర్ఫాన్‌పై కేసు నమోదు చేశారు. ఫుడ్ అడల్ట్రేషన్ బృందానికి ఈ కేసును బదిలీ చేస్తున్నట్లు తెలిపారు. అలాగే బిర్యానీ ఉన్న ప్రాంతాన్ని సీజ్ చేశామని, బిర్యానీ శ్యాంపిల్స్‌ను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపనున్నట్లు వివరించారు.

శబ్దం తగ్గించాలని జన్మదిన వేడుకపై రౌడీషీటర్ దాడి

జూబ్లీహిల్స్, ఎప్రిల్ 6, ప్రభాతవార్తః ఒక జన్మదిన వేడుకలో శబ్దం తగ్గించాలని రౌడీషీటర్ దాడికి పాల్పడిన సంఘటన బంజారాహిల్స్ ఠాణాలో చోటుచేసుకోంది. విషయం తెలుసుకొని రంగంలోకి దిగిన బంజారాహిల్స్ పోలీసులు రౌడీషీటర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్‌లోని భోళానగంలో నివసించే సలీంఖాన్ ఇంట్లో అతని కుమార్తె జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్నాడు. సమీపంలో నివసించే బంజారాహిల్స్ రౌడీషీటర్ ఆఫ్రిది అహ్మద్ అలియాస్ అజార్(35) నేరుగా వేడుకలు జరుగుతున్న ఇంటికి ఒక పెద్ద రాయిని తీసుకొని వెళ్లాడు. అక్కడున్న సలీంఖాన్ కుటుంబ సభ్యుల పట్ల అనుచితంగా ప్రవర్తించడమే కాకుండా వారిపై దాడి చేసి రాయి ఎత్తేసే ప్రయత్నం చేశాడు. దీంతో వేడుకలకు హాజరైన వారు ఎదురుతిరగడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. 100 ద్వారా సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు రౌడీషీటర్ ఆఫ్రిదిని అరెస్ట్ చేశారు. పోలీసులు రౌడీషీటర్‌కు తమదైన శైలిలో విచారించారు. నిందితుడిని న్యాయమూర్తి ముందు హాజరుపర్చగా 14 రోజులపాటు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

మాట్లాడుతున్న మెదక్ ఎంపి రఘునందన్‌రావు

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మెదక్ ఎంపి రఘునందన్‌రావు

సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త : 1980 ఏప్రిల్ 6న ఏర్పాటైన బిజెపి నేడు ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా ఎదిగిందని మెదక్ ఎంపి రఘునందన్‌రావు అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశమే ప్రథమం అనే నినాదాంతో బిజెపి ముందుకుసాగుతుందన్నారు. ప్రతి గ్రామంలో పార్టీ జెండా ఎగరవేసేలా చూడాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శిక్షణ తరగతులలో పాల్గొని పార్టీ సిద్ధాంతాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు తప్పకుండా గుర్తింపు లభిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసి పార్టీ కోసం కష్టపడి పని చేయాలన్నారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబటి బాలేష్‌గౌడ్, చింత సంతోష్, తుంగ కనకయ్య, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ ప్రకారమే సిఎం ఫొటో పెట్టాం

మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కొండపాక, ఏప్రిల్ 6, ప్రభాతవార్త: సిఎం రేవంత్‌రెడ్డి ఫొటోను కెసిఆర్ ఫామ్‌హౌస్‌లోకాని హరీష్‌రావు ఫామ్‌హౌస్‌లో కాని పెట్టలేదని ప్రభుత్వ కార్యాలయమైన గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రొటోకాల్ ప్రకారమే పెట్టడం జరిగిందని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు వాసరి లింగరావు, ఎఎంసి వైస్ చైర్మన్ పర్శరాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ సుదర్శన్, మాజీ పిఎసిఎస్ డైరెక్టర్ బూర్గుల సురేందర్ అన్నారు. సోమవారం వారు వెలికట్ట క్రాస్‌రోడ్డు వద్ద విలేకరులతో మాట్లాడుతూ గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని డిసిసి అధ్యక్షురాలు తూంకుంటా అంక్షారెడ్డి నేతృత్వంలో పెట్టడం జరిగిందన్నారు. సిఎం ఫొటో పెట్టడం తప్పుగా భావిస్తూ గజ్వేల్ నియోజకవర్గంలోని బిఆర్ఎస్ పార్టీ లీడర్లు వీధి రౌడీల్లాగా కాంగ్రెస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గం ఇన్‌చార్జి తూంకుంటా నర్సారెడ్డిని, డిసిసి అధ్యక్షురాలు అంక్షారెడ్డిని అమర్యాదగా మాట్లాడుతూ దూషించడం సరైంది కాదన్నారు. కొండపాక మండలానికి తపస్‌పల్లి రిజర్వాయర్ నుండి సాగు నీరు రాకుండా చేసింది బిఆర్ఎస్ నాయకులేనని ఆరోపించారు. ప్రతాప్‌రెడ్డి మరోసారి నర్సారెడ్డి కుటుంబ సభ్యుల జోలికొస్తే కొండపాక మండలంలో తిరగనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు మంచాల కనకరాములు, శశిధర్‌రెడ్డి, అరెపల్లి శ్రీనివాస్ గౌడ్, సిద్దు, మిద్దె సురేష్, సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

అనాజీపూర్‌లో సిసి రోడ్డు పనులు ప్రారంభం

సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ నిర్మల ఇస్తారి

రాయపోల్, ఏప్రిల్ 6 (ప్రభాతవార్త): మండల పరిధిలోని అనాజీపూర్ గ్రామంలో రూ.5 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సిసి రోడ్ల పనులను సోమవారం సర్పంచ్ సోమని నిర్మల ఇస్తారి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమన్నారు. వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొనే సమస్యలను దృష్టిలో పెట్టుకొని సిసి రోడ్ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సంగీత రవి, వెంకటస్వామి, దాసరి సత్యనారాయణ, మేఘన రాజు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్‌కు మాట్లాడే అర్హత లేదు

యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు విద్యాసాగర్‌యాదవ్

హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త : రాష్ట్రాన్ని పదేళ్ల పాలించిన టిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు చెన్నబోయిన విద్యాసాగర్‌యాదవ్ విమర్శించారు. సోమవారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ, బిఆర్ఎస్ పది సంవత్సరాల పాలనలో ఎన్ని కొత్త రేషన్ కార్డులు ఇచ్చిందో, ఎంతమందికి కొత్త పెన్షన్లు మంజూరు చేసిందో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో గొప్పగా ప్రకటించిన నిరుద్యోగ భృతి పది సంవత్సరాలైనా ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. మూడు ఎకరాల భూమి హామీ ఇచ్చి ఎంతమందికి భూమి ఇచ్చారో వెల్లడించాలన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో నిజమైన పేదలను మోసం చేసి ఇప్పటికే ఇల్లు ఉన్నవారికే ఇళ్లు ఇచ్చారని, తెలంగాణ ప్రజల సొమ్మును ఇతర రాష్ట్రాలకు తరలించిన ప్రభుత్వం బిఆర్ఎస్ కాదా అని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరుతో వేల కోట్ల ప్రజాధనాన్ని వృథా చేసి చివరికి అది కూలేశ్వరంగా మార్చారని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలను మూసివేత పరిస్థితికి తీసుకువచ్చింది గత ప్రభుత్వమేనని, రైతులకు ఉచిత ఎరువులు ఇస్తామని, రుణమాఫీ చేస్తామని చెప్పి మాట తప్పారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇవ్వడానికి కూడా బడ్జెట్ లేకుండా చేసిన ప్రభుత్వం బిఆర్ఎస్ అని విమర్శించారు. ప్రజల సమస్యలపై ప్రతిపక్షాలు ధర్నాలు, రాస్తారోకోలు చేస్తే గత ప్రభుత్వం ముందస్తు అరెస్టులు చేసి ప్రజాస్వామ్యాన్ని అణచివేసిందని విమర్శించారు. పది సంవత్సరాలు అధికారంలో ఉండి సామాన్య ప్రజలకు న్యాయం చేయలేని మీరు ఇప్పుడు ప్రజా ప్రభుత్వంపై విమర్శలు చేయడానికి అర్హులు కాదని యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు చెన్నబోయిన విద్యాసాగర్‌యాదవ్ తీవ్రంగా మండిపడ్డారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

తొగుట, ఏప్రిల్ 6, ప్రభాతవార్త : దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సహకారంతో బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని మాజీ ఎంపిటిసి సుతారి రమేష్ అన్నారు. తొగుట గ్రామానికి చెందిన చిప్ప జనార్ధన్‌కు రూ.21 వేల సిఎంఆర్ఎఫ్ చెక్కును సోమవారం అందజేసి మాట్లాడారు. గ్రామంలో ఎవరైనా మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందితే తమ దృష్టికి తీసుకవస్తే సిఎం సహాయ నిధి అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షులు మాదాసు అరుణ్‌కుమార్, అనిల్, రడం భాస్కర్‌గౌడ్, ఒగ్గె అంజనేయులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త : వేసవి కాలంలో బాటసారుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు మేలు చేస్తాయని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని పాత బస్టాండు సమీపంలో డిసిసి ప్రధాన కార్యదర్శి ఎం.డి.షాబుద్దీన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని సోమవారం ప్రారంభించి మాట్లాడారు. నీటి దానం చాలా గొప్పదానం అన్నారు. చలివేంద్రాలు ఏర్పాటు చేయడానికి పార్టీ నాయకులతో పాటు యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు. చలివేంద్రం ఏర్పాటు చేసిన షాబుద్దీన్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో చిన్నకోడూరు ఎఎంసి వైస్ చైర్మన్ బుస్సా రాజశేఖర్, పార్టీ నాయకులు బొమ్మల యాదగిరి, కలీం, లక్ష్మీ, మెరుగు రాజు, సీతబాలు, శ్రీనివాస్, మహేష్, రాకేష్, రియాజ్, పెర్క యాదగిరి, కె.సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటలో జెండాను ఆవిష్కరిస్తున్న శంకర్‌ముదిరాజ్

కొత్తపల్లిలో...

మిరుదొడ్డిలో...

గజ్వేల్‌లో...

వర్గల్‌లో బిజెపి జెండా ఆవిష్కరిస్తున్న బిజెపి నాయకులు

అక్కన్నపేటలో...

మర్కూక్‌లో బిజెపి జెండా ఆవిష్కరిస్తున్న మండల అధ్యక్షుడు రాంరెడ్డి

ఘనంగా బిజెపి వ్యవస్థాపక దినోత్సవం

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:

అభివృద్ధి, సంక్షేమం బిజెపితోనే సాధ్యమని జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్‌ముదిరాజ్ అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం పార్టీ కార్యాలయంలో నాయకులతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. దేశమే ప్రథమం అనే బలమైన సంకల్పంతో పనిచేసే కార్యకర్తలు కలిగిన పార్టీ బిజెపి మాత్రమేనని తెలిపారు. యుద్ధంతో ప్రపంచ దేశాలు అల్లాడుతుంటే మోడీ పాలనలో దేశం సుభిక్షంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తుంగ కనకయ్య, బాసంగారి వెంకట్, సంతోష్, తోడూపునూరి వెంకటేష్, తాటికొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అక్కన్నపేటలో...

అక్కన్నపేట, ఏప్రిల్ 6, ప్రభాతవార్త: మండల కేంద్రంలో బిజెపి ఆవిర్భావ దినోత్సవాన్ని మండల అధ్యక్షుడు రామంచ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించి నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఏప్రిల్ 6 పార్టీ స్థాపన దినం మాత్రమే కాకుండా దేశభక్తి, సేవా భావం, ప్రజల పట్ల నిబద్ధతకు ప్రతీక అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కోకన్వీనర్ వేణుగోపాలరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొల్లపల్లి వీరాచారి, సంపత్, నాయకులు శ్రీనివాస్, నునావత్ మోహన్‌నాయక్, మాజీ సర్పంచ్‌లు ఎల్లయ్య, కుమార్, మాజీ ఉపసర్పంచ్ ప్రసాద్, శ్రీనివాస్, వేనీ, స్వరూప, ముఖిస సమ్మిరెడ్డి, సంక్రె సంతోష్, అనిల్‌నాయక్, కళ్యాణ్, విష్ణు, సలేంద్ర, తిరుపతి, జంగపల్లి యాదగిరి, కంద్ల సంజీవరెడ్డి, కనకయ్య, ప్రభాకర్ రెడ్డి, రజినీకాంత్, రమేష్ కుమార్, రాజు, కిరణ్, సదయ్య, మధు రాజు తదితరులు ఉన్నారు.

మిరుదొడ్డిలో...

మిరుదొడ్డి, ఏప్రిల్ 6, ప్రభాతవార్త : బిజెపి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొన సోమవారం మండల కేంద్రంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు జిగిరి అమర్ ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కానుగంటి శ్రీనివాస్, మొగుల మల్లేశం, ఏలుముల దేవరాజు, బిజెవైఎం మండల అధ్యక్షులు లింగాల సదానందరెడ్డి, పెద్దకుర్మ కర్ణకర్, స్వామి, తోకల శ్రీనివాస్‌రెడ్డి, మొగుల్ల స్వామి, చీమల రాములు, తాడి చెట్టు లింగం, బయారం రమేష్, చంద్రకుమార్, సంజీవ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌లో...

గజ్వేల్ టౌన్/వర్గల్/రాయపోల్/మర్కూక్, ఏప్రిల్ 6 (ప్రభాతవార్త): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌పరిధి ప్రజ్ఞాపూర్‌లోని బిజెపి కార్యాలయంలో సోమవారం బిజెపి 46వ వ్యవస్థాపక దినోత్సవాన్ని బిజెపి నాయకులు కొలుపుల హనుమంతు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి జెండా ఆవిష్కరించి మిఠాయిలు పంచిపెట్టారు.

ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ శ్రీరామ్ కృష్ణ, సల్ల శ్రీనివాస్, కదుళ్ల దేవేందర్, ఎల్లేశం, తలారి రాజు, తుమ్మ ఉపేందర్, శ్రీరామ్ రామ్‌కిషన్, పూదరి కుమార్, ఎల్ల మధు, టోని యాదవ్, ఎల్ల బాబు, మాదగారి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వర్గల్‌లో...

బిజెపి ఆవిర్భావ దినోత్సవాన్ని వర్గల్ మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వర్గల్‌లో బిజెపి జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు బొల్లిపల్లి తిరుపతిరెడ్డి, మాజీ అధ్యక్షుడు టేకులపల్లి బాల్‌రెడ్డి, గ్రామ బూత్ అధ్యక్షుడు బబ్బూరి వెంకటేష్, మణికాంత్, మండల ఉపాధ్యక్షుడు మఠం మహిపాల్, ప్రజాప్రతినిధులు రామాంజనేయులు, కొల్గూరి వెంకటేష్, జంగం యాదగిరి, వివిధ గ్రామాల బూత్ అధ్యక్షులు, సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో...

రాయపోల్ మండలం కొత్తపల్లి గ్రామంలో బిజెపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బిజెపి జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నాయకులు ఘనంగా నిర్వహించారు. పార్టీ పట్ల నిబద్ధతను చాటుతూ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎక్కాల మల్లేశం, నామసాని స్వామి, బూత్ అధ్యక్షులు చంచనకోట ప్రసాద్, సాయి, గంగాధరి రాజు, కిచ్చుగారి రాజు, మంద ఆనంద్ పాల్గొన్నారు.

మర్కూక్‌లో...

బిజెపి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మర్కూక్‌లో పార్టీ మండల అధ్యక్షుడు సాయిరెడ్డి రాంరెడ్డి ఆధ్వర్యంలో బిజెపి జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్‌గుప్త పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ప్రారంభోత్సవం

అమీన్‌పూర్ ఏప్రిల్ 6 ప్రభాతవార్త : అమీన్‌పూర్ డివిజన్ పరిధిలోని సాయి అంబికా కాలనీ నుండి ఐలాపూర్ తాండ వరకు, లాలా బాయి కాలనీ నుండి బొల్లారం ఇండస్ట్రియల్ ఏరియా వరకు మూడు కోట్ల 25 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్డు, బిటి రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం ఉదయం పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తో కలిసి శంకుస్థాపన చేసిన అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగా రెడ్డి, నూతన రహదారుల నిర్మాణం ద్వారా ఆయా కాలనీల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ నిర్దేశించిన గడువులోగా రహదారుల నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ కౌన్సిలర్ కృష్ణ, కల్పన ఉపేందర్ రెడ్డి, కొల్లూరు చంద్రకళ గోపాల్, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, ఈఈ సురేష్, మాజీ కో ఆప్షన్ సభ్యులు తల్లారి రాములు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

"బడి మనదే - బాధ్యత మనదే"

కొల్చారం, ఏప్రిల్ 6 ప్రభాతవార్త : మండలంలోని సంగాయిపేట తండా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల అత్యవసర సమావేశాన్ని గ్రామపంచాయతీ పాలకవర్గం నిర్వహించింది. ఎంఇవో ఉమారాణి ఆదేశాల మేరకు ఈ సమావేశం ఏర్పాటు చేసి పాఠశాల స్థితిగతులు, అక్కడ నెలకొన్న సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశానికి గ్రామ సర్పంచ్ పుర్ర కాంతమ్మ ప్రభాకర్, ఉప సర్పంచ్ నందు, వార్డు సభ్యులు బద్యానాయక్, జైల్ సింగ్, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం, అంగన్వాడి టీచర్, గ్రామ పెద్దలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు ఎలాంటి ఆటంకం కలిగించరాదని, విధి నిర్వహణకు భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే మద్యం సేవించి పాఠశాల ప్రాంగణంలోకి రావడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. పాఠశాల ప్రాంగణంలో ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం సేవించరాదని తెలిపారు. "బడి మనదే - బాధ్యత మనదే" అనే ఉద్దేశంతో గ్రామస్తులందరూ పాఠశాల అభివృద్ధికి తోడ్పడాలని సర్పంచ్, ఉప సర్పంచ్ కోరారు. ఇకపై పాఠశాల ప్రాంగణంలో ఎవరైనా మద్యం సేవించినట్లు గుర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సంగాయిపేట పాలకవర్గం ఈ సమావేశంలో తీర్మానం చేసింది. పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల భవిష్యత్తు కోసం గ్రామ ప్రజలందరూ సహకరించాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు గణేష్, ఉపాధ్యాయురాలు భవాని, అంగన్వాడి టీచర్ మంగ తదితరులు పాల్గొన్నారు.

కిష్టాపూర్‌లో బిజెపి ఆవిర్భావ దినోత్సవం

కొండాపూర్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త : కిష్టాపూర్ గ్రామంలో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ బీజేపీ బూత్ అధ్యక్షులు సాదుల దుర్గాప్రసాద్, ఏంబరి శేఖర్‌యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షులు పంతుల హరీష్ పటేల్ పాల్గొని పార్టీ ఆవిర్భావ దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో కిష్టాపూర్ గ్రామ సర్పంచ్ సాదుల స్వప్న ఊశయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎంచర్ల శేఖర్‌యాదవ్, ఉపసర్పంచ్ చందాపురం నిర్మల శేఖర్, రెండోవార్డ్ సభ్యురాలు పసుల రేఖ యాదగిరి, మండలఉపాధ్యక్షులు వడ్ల చంద్రశేఖర్, రాంపూర్ మాజీ ఎంపీటీసీ యాదగిరి, కిష్టాపూర్ మాజీ సర్పంచ్ మల్కే మల్లేశం, నాయకులు సాదుల సాయిరాజ్, శేరిపల్లి శేకులు, కరే సిద్దయ్య, సాదుల దుర్గయ్య తదితర బీజేపీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

గారకుర్తి వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా

జెసిబి, ఐదు ట్రాక్టర్లు సీజ్

కొండాపూర్, ఏప్రిల్ 5 ప్రభాతవార్త : మండలంలోని గారకుర్తి వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై పోలీసులు చర్యలు చేపట్టారు. రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి జేసీబీతో పాటు ఐదు ట్రాక్టర్లను సీజ్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గారకుర్తివాగు నుంచి సదాశివపేట మండలం గొల్లగూడెం గ్రామానికి ఇసుకను తరలిస్తుండగా ఆదివారం మధ్యాహ్నం సుమారు 12 గంటల ప్రాంతంలో జేసీబీ సహాయంతో ఐదు ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేయడంతో కొండాపూర్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సోమేశ్వరి కేసు నమోదు చేసి జేసీబీతో పాటు ఐదు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తెలిపారు. అక్రమ ఇసుక రవాణాపై విచారణ కొనసాగుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

తాగునీటి ఎద్దడికి చెక్.. 13వ వార్డులో బోరుబావి ప్రారంభం

గుమ్మడిదల, ఏప్రిల్ 6 ప్రభాతవార్త : గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో దీర్ఘకాలంగా కొనసాగుతున్న తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. కాంగ్రెస్ పార్టీ వార్డు కౌన్సిలర్ మూడు చింతల నరేందర్ రెడ్డి ప్రజల ఇబ్బందులను గమనించి వెంటనే స్పందిస్తూ బోరుబావి త్రవ్వడం కోసం సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ కుమార్‌గౌడ్ హాజరై బోరుబావిని ప్రారంభించారు. 13వ వార్డు కౌన్సిలర్ నరేందర్‌రెడ్డికి తాగునీటి సమస్యను వివరించగా స్పందించి చర్యలు తీసుకోవడం కాలనీవాసుల్లో ఆనందాన్ని నింపింది. ఈ సందర్భంగా కాలనీవాసులు నరేందర్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల అవసరాలను ముందుగానే గుర్తించి స్పందించడం నిజమైన ప్రజాప్రతినిధి లక్షణమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బ్యాగరి వరలక్ష్మి, గొకరి నిర్మల, ఆకుల మాధవి, తుపాకుల రాధిక, జైపాల్ రెడ్డి, సంజీవ రెడ్డి, మేడిపల్లి మురళి, కిషన్, నాయకులు తులసి దాస్, మేకల యాదగిరి, వెంకట్రాం రెడ్డి, హుస్సేన్, పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, ఆకుల సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థుల నమోదుకై అవగాహన ర్యాలీ

హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త : పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతన విద్యా సంవత్సరం సందర్భంగా ముందస్తు విద్యార్థుల నమోదుకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు గంగిశెట్టి మహేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 11, 15, 17వ వార్డుల్లో ప్రజలకు ప్రభుత్వ పాఠశాలల్లో లభిస్తున్న సౌకర్యాల గురించి వివరించారు. ఈ సందర్భంగా 11వ వార్డు కౌన్సిలర్ పూదరి వరప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో గురుకుల పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని సౌకర్యాలు ఉన్నాయని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పిల్లలను కూడా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. 17వ వార్డు కౌన్సిలర్ గాదపాక రవీందర్ మాట్లాడుతూ హుస్నాబాద్ మండలంలో అత్యుత్తమ ప్రమాణాలతో అన్ని సౌకర్యాలు కలిగిన పాఠశాలగా ఈ పాఠశాల నిలుస్తుందన్నారు. 15వ వార్డు కౌన్సిలర్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న మాట్లాడుతూ పాఠశాలలో ఆధునాతన సైన్స్ ల్యాబ్, ఐటీ, ఆటోమోటివ్ వంటి వొకేషనల్ కోర్సులు, కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ క్లాసులు, స్పోర్ట్స్, కరాటే, యోగ వంటి అనేక సౌకర్యాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.నరేందర్, పి.లక్ష్మయ్య, ఎస్.రవీందర్, పి.రాజయ్య, వి.యుగంధర్ రెడ్డి, బి.మనోహర్, జి.రవీందర్, ఎం.వనమాల, కే.శ్వేత, టి.నవీన్ కుమార్, ఏ.రేణుకతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న హరికృష్ణ

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ

సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త : సిఎం రేవంత్‌రెడ్డి సంక్షేమంతోపాటు అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. నారాయణరావుపేట మండలం మాటిండ్ల గ్రామంలో ఉప సర్పంచ్ పర్శరాములు ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరణ చేసి అనంతరం గ్రామంలోని మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. రాష్ట్రంలో సిఎం రేవంత్‌రెడ్డి సర్కార్ గడిచిన రెండున్నర ఏళ్లలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత కరెంట్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రైతు రుణమాఫీ, రైతు భరోసా, రాజీవ్ ఆరోగ్యశ్రీ లాంటి ఎన్నో కార్యక్రమాలతో రేవంత్‌రెడ్డి సర్కార్ ముందుకు సాగుతుందన్నారు. డిసిసి ప్రధాన కార్యదర్శి చింతల రాజ్‌వీర్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ఎఎంసి వైస్ చైర్మన్, డైరెక్టర్లు బొమ్మల యాదగిరి, కలీం, లక్ష్మీ, రామచంద్రం, బిక్షపతి, వంశీ, అశోక్‌గౌడ్, యాదగిరి, రాజయ్య, రాజు, బాబు, నవీన్‌యాదవ్, వెంకట్‌రెడ్డి, కె.సాంబమూర్తి పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కు అందరజేత

మర్కూక్, ఏప్రిల్ 6 (ప్రభాతవార్త): ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరమని సర్పంచ్ పత్తి నర్సింలుయాదవ్ అన్నారు. మండల పరిధిలోని దామరకుంట గ్రామానికి చెందిన పైతరి అశోక్ ముదిరాజ్ అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవడంతో ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.18వేల సిఎంఆర్ఎఫ్ చెక్కును సోమవారం స్థానిక నర్సింలు పత్తి నర్సింలుయాదవ్ లబ్ధిదారునికి అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, వెంకటేష్, కృష్ణ, పరమేష్, బాలరాజు, భానుచందర్, అంజయ్య పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

మర్కూక్, ఏప్రిల్ 6 (ప్రభాతవార్త): రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన పశు వైద్య శిబిరాలలో పశువులకు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా తీసుకోవాలని పశువైద్యాధికారి డాక్టర్ శిరీష అన్నారు. సోమవారం మండల పరిధిలోని దామరకుంట, కాశిరెడ్డిపల్లి గ్రామాల్లో ఏర్పాటుచేసిన పశు వైద్య శిబిరాలను సర్పంచ్‌లు పత్తి నర్సింలుయాదవ్, భాస్కర్‌లు డాక్టర్ శిరీషతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువుల్లో వ్యాపించే ఎఫ్ఎండి వ్యాధి నివారణ కోసం 29 ఎద్దులు, 36 గేదెలకు టీకాలు వేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఈ ఉచిత శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పాలకవర్గ సభ్యులు, పశువైద్య సిబ్బంది, గోపాలమిత్ర ఆంజనేయులు, విఎల్ఓ భాస్కర్, రైతులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక దృఢత్వం : ఎంపిడివో

చిలిపిచెడ్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త : విద్యార్థులు చదువుతోపాటు మార్షల్ ఆర్ట్స్ వంటి క్రీడల్లో రాణించడంతో భవిష్యత్తులో శారీరక దృఢత్వంతో పాటు మానసిక దృఢత్వం పెంపొందుతుందని ఎంపీడీవో ప్రశాంత్, ఎంఈఓ విటల్, ఎస్ఐ నర్సింలు, చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం చిట్కుల్ కేజీబివి పాఠశాలలో వారియర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ గ్రాండ్ మాస్టర్ పోచయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు బెల్ట్ ఎగ్జామ్ నిర్వహించగా ఇందులో కేజీబివి పాఠశాలతో పాటు చిట్కుల్, గౌతాపూర్, అందోల్ మండల మాసాన్ పల్లి గ్రామాల ఉన్నత పాఠశాలలకు చెందిన సుమారు వంద మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఉదయం నుంచి చేపట్టిన బెల్ట్ ఎగ్జామ్ లో విద్యార్థులు తమ తమ ప్రతిభను కనబరిచి బెల్టులు, సెరిఫికెట్లు పొందారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రశాంత్, ఎంఈఓ విట్టల్, ఎస్ఐ నర్సింలు, బీఆర్ఎస్ పార్టీ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, చందూరు కాంప్లెక్స్ హెచ్ఎం రమేష్, సర్పంచి రాములు, ఉప సర్పంచ్ అఖిల్, పాఠశాల ఎస్ఓ అంజలి, కార్యదర్శి తిరుపతి, మాస్టర్లు మహేష్‌గౌడ్, మురళి, నవీన్, రాజు, షాదుల్లా, మహేష్‌గౌడ్, హరిప్రసాద్, సుప్రియ, సిబ్బంది పాల్గొన్నారు.

సర్టిఫికేట్లు అందుకుంటున్న విద్యార్థులు

సమస్యలు పట్టించుకోని కెసిఆర్ పదవికి రాజీనామా చేయాలి

పిసిసి కార్యదర్శి నాయిని యాదగిరి



మాట్లాడుతున్న నాయిని యాదగిరి

గజ్వేల్, ఏప్రిల్ 6 (ప్రభాతవార్త): ప్రజలతో ఎన్నికై ప్రజల సొమ్ముతో జీతం తీసుకుంటున్న మాజీ ముఖ్యమంత్రి, గజ్వేల్ ఎమ్మెల్యే కెసిఆర్ ప్రజల సమస్యలను పట్టించుకోవడంలేదని గజ్వేల్ బంద్‌కు పిలుపునిచ్చారా అని పిసిసి కార్యదర్శి నాయిని యాదగిరి ఘాటుగా విమర్శించారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తూంకుంట ఆంక్షరెడ్డి నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గ సమస్యలు పట్టించుకోని కెసిఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలన్నారు. సమస్యలు పట్టించుకోవాలని అడిగినందుకు గజ్వేల్ బంద్‌ను ప్రకటించడం హాస్యాస్పదమన్నారు. ప్రజాసమస్యలను పరిష్కరించాలని కోరడం తప్పా అన్నారు. కెసిఆర్ ప్రజల కోసం పనిచేయాలని కోరితే బిఆర్ఎస్ నేతలకు ఎందుకు భయం పుట్టుకుందో అర్థం కావడంలేదన్నారు. ప్రతాప్‌రెడ్డి రాజకీయ సన్యాసి అని, పూటకో పార్టీ మారే ప్రతాప్‌రెడ్డి రాజకీయాలు అందరికీ తెలుసన్నారు. పదవుల కోసమే పార్టీలు మారుతూ రాజకీయాలను వ్యాపారంగా మార్చుకున్నాడని మండిపడ్డారు. టిడిపిలో ఉన్నప్పుడు బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేశాడని, టిడిపి నుంచి ఓడిపోయిన ప్రతాప్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరి గజ్వేల్ ఎమ్మెల్యేగా పోటీచేసి అక్కడా ఓడిపోయారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసిన సమయంలో కెసిఆర్‌ను ఓడించాలని హరీష్‌రావు తనకు ఫోన్ చేసి చెప్పాడని ప్రతాప్‌రెడ్డి బాహాటంగా చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పటికైనా బ్లాక్‌మెయిల్ రాజకీయాలు బందచేసి ప్రజలకు ఉపయోగపడే రాజకీయం చేయాలని హితవు పలికారు. ప్రతాప్ రెడ్డి నీచపు రాజకీయాలు గజ్వేల్ ప్రజలకు బాగా తెలుసని, పేదల భూములను గుంజుకొని కబ్జాలు చేస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడని ఆరోపించారు. గజ్వేల్ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని బిఆర్ఎస్ నేతలపై మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, కౌన్సిలర్లు నర్సింహారెడ్డి, గుంటుకు లక్ష్మిశ్రీనివాస్, గుగులోతు రమేష్, కొండపోచమ్మ డైరెక్టర్ గుండు లక్ష్మణ్, మైనార్టీ నేత సమీర్, సుఖేందర్‌రెడ్డి, విఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఊడెం సారిక శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజావాణిలో అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్ రజని కుమారి

ప్రజావాణిలో అర్జీల స్వీకరణ

రామాయంపేట, ఏప్రిల్ 6, ప్రభాతవార్త : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో తహసీల్దార్ రజనీకుమారి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించే లక్ష్యంతో ఈకార్యక్రమం కొనసాగుతున్నట్లు ఆమె తెలిపారు. నేటి ప్రజావాణిలో డబుల్ బెడ్‌రూమ్ ఇంటికోసం ఒక దరఖాస్తు, భూసమస్యలకు సంబంధించిన రెండు దరఖాస్తులు అందినట్లు ఆమె పేర్కొన్నారు. వచ్చిన ప్రతి అర్జీని ప్రాధాన్యత క్రమంలో పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు.

కంబాలపల్లిలో ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ

ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేస్తున్న దృశ్యం

సదాశివపేట, ఏప్రిల్ 6 (ప్రభాతవార్త): మండలంలోని కంబాలపల్లి గ్రామంలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పునర్ నిర్మాణానికి ఈరోజు సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టిజిఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, సిడిసి చైర్మన్ గడిల రామ్‌రెడ్డి సహకారంతో కంబాలపల్లి సర్పంచ్ ఇందూరి భారతమ్మ బాబు, ఉప సర్పంచ్ కుమ్మరి పార్వతమ్మ ఆంజనేయులు ఆధ్వర్యంలో కుమ్మరి గీత పాండు ఇందిరమ్మ ఇల్లుకుభూమి పూజ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కాంగ్రెస్ పార్టీ కంబాలపల్లి గ్రామ అధ్యక్షుడు బెలురి భీమ్ సెన్‌రెడ్డి, వార్డ్ మెంబర్ కుమ్మరి ఆంజనేయులు, పసుల ప్రభు, బేలూరి ప్రభాకర్‌రెడ్డి, సయ్యద్ ఆఫ్రీన్ బేగం, మునీర్, గ్రామ పెద్దలు బోయిని పాండు, సయ్యద్ రసూల్, చీమలు దారి శ్రీకాంత్, కుమ్మరి సిద్దు పాల్గొనడం జరిగింది.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

రామాయంపేట, ఏప్రిల్ 6, ప్రభాతవార్త : రామాయంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సోమవారం మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు ప్రారంభించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఈ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినట్లు సిఇఒ పుట్టి నర్సింహులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన పంటలను దళారులకు అమ్మి మోసపోకుండా, ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రజనికుమారి, మార్కెట్ కమిటీ కార్యదర్శి ఈశ్వర్, వ్యవసాయశాఖ అధికారి సోమలింగారెడ్డి, ఏఈవో ప్రవీణ్, మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సరాఫ్ యాదగిరి, కౌన్సిలర్‌లు గజవాడ నాగరాజు, గుగులోత్ రవి నాయక్, బైరం స్వప్నకుమార్, పుట్టి సందీప్, దేవుని రంజిత్, దాకి శ్యామల స్వామి, డీసీసీ ఉపాధ్యక్షులు దేమె యాదగిరి, మామిడి సిద్దరాములు, డీసీసీ కార్యదర్శి పోచమ్మల గణేష్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చింతల స్వామి, మండల అధ్యక్షుడు బండారి మహేందర్‌రెడ్డి, నాయకులు యెనిశెట్టి అశోక్, ఫ్లోవెల్ కిష్టారెడ్డి, శివప్రసాద్‌రావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎఎంసి చైర్మన్

మంచినీటి బోరును ప్రారంభిస్తున్న దృశ్యం

మునిపల్లి, ఏప్రిల్ 6(ప్రభాతవార్త): మండలంలోని పెద్దగోప్లారం, తాటిపల్లి, మేళాసంగెం, మన్‌సాన్‌పల్లి గ్రామాలలో మార్కెట్ కమిటీ చైర్మన్ మంతూర్ సుధాకర్‌రెడ్డి సోమవారం పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. గోప్లారంలో మంచినీటి బోరును ప్రారంభించారు. అనంతరం మన్‌సాన్‌పల్లిలో సిసి రోడ్డు పనులు ప్రారంభించారు. తాటిపల్లి, మేళాసంగెంలలో సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రత్యేక చొరవతో మునిపల్లి మండలంలో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. పెద్ద గోప్లారంలో వేసవికాలం దృశ్య నీటిఎద్దడి నివారణకు బోర్ బావి ప్రారంభించి నీటిసమస్యని పరిష్కరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గోపులారం సర్పంచ్ మల్లేశం, మాజీ ఎంపీటీసీ పాండు, మాజీ ఎంపీపీ రాంరెడ్డి, ఉప సర్పంచ్, సీనియర్ నాయకులు రసూల్ పటేల్, వార్డ్ సభ్యులు, గ్రామ పెద్దలు, నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నల్లవాగు ప్రాజెక్టులో తగ్గుతున్న నీటి మట్టం

సిర్గాపూర్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త: మండల పరిధిలోని నల్లవాగు ప్రాజెక్టు(మధ్యతరహా ప్రాజెక్టు)లో నీటినిల్వలు క్రమేపి తగ్గుతున్నాయి. గత వర్షాకాలంలో నిండుకుండలా ఉన్న డ్యామ్ ప్రస్తుతం ఖాళీ అవుతోంది. ప్రాజెక్టు గరిష్ట మట్టం 1494 అడుగులు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 1484.6 అడుగులకు చేరిందని ఏఈ శ్రీవర్ధన్‌రెడ్డి తెలిపారు. రబీ పంటల చివరి విడత కొరకు కుడి కాలువ ద్వార 100, ఎడమ కాలువ ద్వార 15 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఏఈ శ్రీవర్ధన్‌రెడ్డి వివరించారు.


నల్లవాగు ప్రాజెక్టులో తగ్గుముఖం పట్టిన నీటి నిల్వ

దామరచెరువులో బిజెపి జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం

మునిపల్లిలో...

మైకోడ్‌లో

సిర్గాపూర్‌లో...

గుమ్మడిదలలో...

పెద్దశంకరంపేటలో...

అల్లాదుర్గంలో...

నాగల్‌గిద్దలో...

ఘనంగా బిజెపి 46వ ఆవిర్భావ దినోత్సవం

వెంకటాపూర్‌లో...

తెల్లాపూర్‌లో బిజెపి జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రామాయంపేట, ఏప్రిల్ 6, ప్రభాతవార్త : భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని దామరచెరువు గ్రామంలో సోమవారం పార్టీ జెండా ఆవిష్కరణను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి జెండాను ఆవిష్కరించి పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లో విస్తరించేందుకు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి దిలీప్‌కుమార్, మాజీ సర్పంచ్ శంకర్, నాయకులు నరేష్, హరికృష్ణ, సాయి ప్రశాంత్, దిలీప్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దంతేపల్లిలో సర్పంచ్ ఆధ్వర్యంలో...

రామాయంపేటమండలం దంతేపల్లిలో గ్రామ సర్పంచ్ మస్కూరి బాలరాజు ఆధ్వర్యంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మునిపల్లిలో...

మునిపల్లి, ఏప్రిల్ 6 (ప్రభాతవార్త): బిజెపితోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పడమటి నాగిశెట్టి అన్నారు. బిజెపి 47వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం మునిపల్లిలో పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పండిట్ దీన్‌దయాళ్, డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీలకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పెద్దలోడి గ్రామ సర్పంచ్ రాజు, బోడిశెట్టిపల్లి ఉప సర్పంచ్ బస్వరాజ్, మండల ఉపాధ్యకుడు క్రిష్ణమూర్తి, జైపాల్‌రెడ్డి, రవికుమార్, బీజేవైఎం నాయకులు నాగేష్‌యాదవ్, సంగయ్య స్వామి, బిజెపి బూత్ అధ్యక్షుడు చిలపల్లి పరశురామ్, గార్లపల్లి మహేష్, అల్లపురం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపూర్‌లో...

సదాశివపేట, ఏప్రిల్ 6 (ప్రభాతవార్త): మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో బిజెపి 46వ ఆవిర్భావ దినోత్సవ జెండావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కరణం ఆదిత్య, ప్రధాన కార్యదర్శిలు నామ హరీష్, ఉక్కిస భరత్, నాయకులు సారా కృష్ణ, అంబదాస్, జగన్నాథ్ రెడ్డి, శ్రీకాంత్, సుభాన్, లక్ష్మణ్, అంబదాస్, ప్రసాద్, నాగరాజు, ప్రశాంత్, దుర్గరాజ్, అనిల్, మల్లేశం, నితీష్, సాకేత్, మల్లేష్, గోపాల్ శివ, మాణిక్యం బూత్ అధ్యక్షులు సురేష్, సత్యనారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

మైకోడ్‌లో...

మనూర్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త: మండల పరిధిలోని మైకోడ్ గ్రామంలో సోమవారం భారతీయ జనతా పార్టీ 46వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. పార్టీ జండాను ఆవిష్కరించి వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో బిజెపి మండల మాజీ అధ్యక్షులు, జిల్లా కార్యవర్గ సభ్యులు కర్ణం ఈశ్వరప్ప, మండల ప్రధాన కార్యదర్శి బి విజయ్ కుమార్, 1వ, 2 వ బూత్‌ల అధ్యక్షులు బీరప్ప, బి విఠల్‌రెడ్డి, నాయకులు చంద్రకాంత్, సంగన్న, సర్పంచ్ కృష్ణ, ఉమా కాంత్, కర్ణం అమరేష్, అల్లిపూర్ వైద్యనాథ్ పాల్గొన్నారు.

సిర్గాపూర్‌లో...

సిర్గాపూర్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త: మండల కేంద్రంలో సోమవారం భారతీయ జనతా పార్టీ 46వ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ మండల అధ్యక్షులు శంకర్ పాటిల్ నాయకులతో కలిసి పార్టీ జండాను ఆవిష్కరించి ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల మాజీ అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావుపాటిల్, మండల యువ మోర్చా అధ్యక్షులు యాదగిరి ముదిరాజ్, ఎస్‌సి మోర్చా అధ్యక్షులు రాజు, యువ మోర్చా ప్రధాన కార్యదర్శి బిక్షపతి, భూత్ అధ్యక్షులు సుభాష్ సాగర్, విఠల్ సాగర్, భీమన్న, పండరి గౌడ్, దశరథ్, అనిల్, నర్సింగ్, మధు నాయక్, శోభన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నాగల్‌గిద్దలో...

నాగల్‌గిద్ద, ఏప్రిల్ 6, ప్రభాతవార్త: మండల కేంద్రంలో సోమవారం భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాగల్‌గిద్ద చౌరస్తాలో పార్టీ జండాను ఆవిష్కరించి వేడుకలను ఆనందోత్సవాలతో జరుపుకున్నారు. కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు రాజశేఖర్, నాయకులు సురేష్, నాగశెట్టి పటేల్, బీజెవైఎం నాయకులు రమేష్ యాదవ్, అంజన్న తదితరులు పాల్గొన్నారు.

అల్లాదుర్గంలో...

అల్లాదుర్గం, ఏప్రిల్ 6, ప్రభాతవార్త: మండల కేంద్రంలో సోమవారం భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నాయకులు ఘనంగా జరుపుకున్నారు. పార్టీ జండాను ఆవిష్కరించి భారత్ మాతాకీ జై అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాల రాములు, యాదగిరి, జంగం వీరయ్య స్వామి తదితరులు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేటలో...

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 6, ప్రభాతవార్త : బిజెపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కార్యాలయంలో సోమవారం ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయం ముందు బిజెపి మండల అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ పార్టీ జెండాను ఎగరవేశారు. ఈకార్యక్రమంలో మెదక్ జిల్లా బిజెపి నాయకులు కోణం విట్టల్, మండల అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణ, బీజేవైఎం మండల అధ్యక్షుడు బుగుడాల కృష్ణ, నాయకులు అనిల్, శంకర్రావు ధ్రువకుమార్ వెంకయ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

గుమ్మడిదలలో...

గుమ్మడిదల, ఏప్రిల్ 6 ప్రభాతవార్త : బిజెపి స్థాపించి 47 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని పలు గ్రామాల్లో బీజేపీ నాయకులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. గ్రామాలలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం మున్సిపాలిటీ అధ్యక్షులు, కౌన్సిలర్ నర్సంపల్లి రాజిరెడ్డి సమక్షంలో నిర్వహించడం జరిగింది. అలాగే గుమ్మడిదల, మున్సిపాలిటీ, దోమడుగు, మంబాపూర్, బొంతపల్లి గ్రామాలతో పాటు వార్డులలో జెండాను ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో రాఘవరెడ్డి, యాదగిరి, గోవర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్ విజయలక్ష్మి, రామ్‌చందర్, కిషోర్, శ్రీనివాస్‌యాదవ్, విజయ్ కుమార్, పెంటా రెడ్డి, వీరారెడ్డి, మహేష్, హరికృష్ణ, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో...

రామచంద్రాపురం, ఏప్రిల్ 6, ప్రభాతవార్త: భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం తెల్లాపూర్ డివిజన్ పరిధిలో బిజెపి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు మల్లెపల్లి రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురష్కరించుకుని తెల్లాపూర్‌లోని ఆటో స్టాండ్ అలియన్స్, సర్కిల్, శివాజీ సర్కిల్, జ్యోతిరావుపూలే కాలనీ, ఉస్మాన్‌నగర్, కొల్లూర్ డబుల్ బెడ్ రూంలలో పార్టీ జండాలను ఆవిష్కరించి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పార్టీ ఆవిర్భావాన్ని పురస్కరించుకుని తెల్లాపూర్‌లో మహిళలు ప్రియాంక, శైలజ, జ్యోతి, రాధ, సుందర్ అశోక్, కపిల్‌లు బిజెపి తీర్థం పుచ్చుకున్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌లు ఇచ్చినందుకు బిజెపి చేరినట్లు పార్టీలో చేరినట్లు మహిళలు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్‌కుమార్, కోటే రవి, నర్సింహా, కృష్ణ యాదవ్, నవరి రాజిరెడ్డి, మంగలి శ్రీనివాస్, నవారరి లక్ష్మరెడ్డి, కొండకళ్ల ముత్యంరెడ్డి, శంకర్, కోటి ప్రవీణ్, రవి, సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, విఠల్‌గౌడ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

జాతరలో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న పోలీసు సిబ్బంది

బేతాళ స్వామి జాతరలో డాగ్ స్క్వాడ్ తనిఖీలు

అల్లాదుర్గం, ఏప్రిల్ 6, ప్రభాతవార్త: మండల కేంద్రంలో బేతాళస్వామి జాతర ఉత్సవాల్లో సోమవారం డాగ్‌స్క్వాడ్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. మంగళవారం జరిగే జాతరకు తెలంగాణతోపాటు కర్ణాటక, మహారాష్ట్రల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో చేరుకుని స్వామివారిని దర్శించుకునే అవకాశాలు ఉండటంతో జాతర ప్రశాంత వాతావరణంలో ముగిసేలా పోలీసులు ముందస్తుగా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. జాతర ఉత్సవాల్లో మత్తు పదార్థాలు వినియోగించకుండా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు కొనసాగకుండా చర్యలు తీసుకున్నట్లు ఎస్ఐ శంకర్ పేర్కొన్నారు.

జాతర ఏర్పాట్లకు ఆర్థిక సహాయం

మనూర్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త: మండల పరిధిలోని బోరంచ గ్రామంలో నల్లపోచమ్మ ఆలయ 7 వారాల జాతర ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించే ఏర్పాట్లకు (సీరియల్ లైట్లు తదితర) మద్వార్ గ్రామానికి చెందిన పిట్ల అంజయ్య రూ. 5111 ఆలయ కమిటీ చైర్మన్ మల్లయ్యకు అందచేశారు. అంతకు ముందు ఆలయంలో ఆలయ అర్చకులు సిద్దయ్యస్వామి వేద మంత్రాలు వల్లిస్తుండగా అంజయ్య ప్రత్యేక పూజా కార్యక్రమాలు అందచేశారు. ఆలయ అర్చకులు అంజయ్యకు ఆశీర్వచనాలు చేసి తీర్థ ప్రసాదాలు అందచేయగా ఆలయ కమిటి చైర్మన్ మల్లయ్య దాత అంజయ్యకు శాలువాతో సత్కరించారు.

కుట్టుమిషన్లు పంపిణీ

మునిపల్లి, ఏప్రిల్ 6 (ప్రభాతవార్త): మండలం పరిధిలోని పెద్దగోపులారం గ్రామంలో మహిళలకు కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో 26 మంది మహిళలకు శిక్షణ ఇవవడం జరిగింది. శిక్ష పొందిన మహిళలకు మార్కెట్ కమిటీ చైర్మన్ సుదాకర్‌రెడ్డి కుట్టు యంత్రాలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లేశం, మాజీ ఎంపీటీసీ పాండు, మాజీ ఎంపీపీ రాంరెడ్డి, నాయకులు రసూల్‌పటేల్, పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పోగుల రాజు

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి : పోగుల రాజు

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 6, ప్రభాతవార్త: బిజెపి బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు పోగులు రాజు అన్నారు. బిజెపి 46వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చిన్నశంకరంపేటలోని పోగుల రాజు ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజల్లోకి తిసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు లింగంగౌడ్, మూర్తిశంకర్, నరేందర్‌రెడ్డి, ఆకుల రాజు, మేడి శ్రీనివాస్, కర్రోళ్ల స్వామి, శివశంకర్, తాటికొండ రవి, కమ్మరి గోపాల్, నాగరాజు, దేవరాజు, స్వామి, జంగం శ్రీనివాస్, రాంప్రసాద్, ప్రవిణ్, పోచయ్య, బిక్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే దేశాభివృద్ధి : శంకర్‌పాటిల్

సిర్గాపూర్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త: మండల పరిధిలోని వంగ్దాల్, వాసర్, అంతర్గాం గ్రామాల్లో సోమవారం భారతీయ జనతా పార్టీ 46వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పార్టీ మండల అధ్యక్షులు శంకర్ పాటిల్ పార్టీ జండాలను ఆవిష్కరించి ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా శంకర్‌పాటిల్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తోందని, గ్రామాలఅభివృద్దే దేశాభివృద్ధి అవుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బేగరి పండరి, సంతోష్ పాటిల్, తుకారం పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

టేక్మాల్‌లో 'మహనీయుల జయంతి' పోస్టర్ విడుదల

టేక్మాల్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త : మహనీయుల జయంతి కార్యక్రమం పోస్టర్‌ను సోమవారం టేక్మాల్‌లో విడుదల చేశారు. ఏప్రిల్ 13 న జోగిపేట శ్రీరామ పక్షన్ హల్‌లో జరిగే మన మహనీయులు బాబు జాగ్జీవన్ రాం మహాత్మా పూలే. బాబా సాహెబ్ అంబేద్కర్ గార్ల జయంతి కార్యక్రమన్ని విజయవంతం చేయాలనీ ఇ కార్యక్రమనికి వక్తలు నలిగంటి శరత్ చామర్ అరుణ గోగులమండ వస్తున్నారని వారు అన్నారు ఇ కార్యక్రమంలో సభ నిర్వాహకులు అరిటిక్యాల శంకరయ్య. పొట్టిపల్లి మొగులయ్య. సంగారెడ్డి జిల్లా ఎస్సి ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మనిటరింగ్ కమిటీ సభ్యులు కాశపాగ ఇమ్మయ్య. మెదక్ జిల్లా ఎస్సి ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మనిటరింగ్ కమిటీ సభ్యులు మహేందర్, కాదులూరు మాజీ సర్పంచ్ యాదయ్య, కంది భాగయ్య, రొడ్డ సాయిలు, రమేష్‌నాయక్, మసన్నగారి నాగరాజు, సంగ రమేష్, పొట్టిగాళ్ల మోహన్, అజ్జుమర్రి లింగం, చింత అనిల్, శివకుమార్ పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల చేస్తున్న దృశ్యం

సాగు నీటిని వెంటనే విడుదల చేయాలి


మెదక్ జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త: మెదక్ సింగూర్ ప్రాజెక్ట్ నుంచి ఘనపూర్ ఆయకట్టుకు వెంటనే సాగు నీటిని విడుదల చేయాలని మాజీ డిప్యూటీ స్పీకర్, బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు ఎం.పద్మదేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు బిఆర్‌ఎస్ నాయకులు, రైతులు, కౌన్సిలర్లతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ, సింగూర్ ప్రాజెక్టు నుంచి ఘనపూర్ ఆయకట్టుకు వెంటనే 0.3 టీఎంసీ నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఘనపూర్ ఆయకట్టు కింద పంటలు ప్రస్తుతం కీలకమైన పొట్ట దశలో ఉండగా నీటి కొరత కారణంగా ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. క్రాప్ హాలిడే ప్రకటించక ముందే రైతులు పంటలు వేసుకున్నారని, ఆలస్యంగా ప్రకటించడంవల్ల వారు తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పంట చేతికి వచ్చే ఈ సమయంలో ఒక తడి నీరు అందిస్తే పంటలు కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. రైతులు నష్టపోకుండా ఉండేందుకు సింగూర్ ప్రాజెక్ట్ నుంచి ఘనపూర్ ఆనకట్టకు వెంటనే 0.3టీఎంసీ నీటిని విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. సింగూర్ ప్రాజెక్ట్ నుంచి ఘనపూర్ ఆయకట్టుకు నీటి విడుదల విషయంలో ప్రభుత్వం తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో సునీత లక్ష్మారెడ్డి సింగూర్ నుంచి ఘనపూర్‌కు నీరు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసి సింగూర్ నీటిని విడుదల చేసినప్పటికీ, వెంటనే మంజీరా వద్ద నీటి ప్రవాహాన్ని నిలిపివేయడం అన్యాయమని విమర్శించారు. మెట్రోవాటర్ వర్క్స్ వద్ద ఫైల్ తిరస్కరణ పేరుతో నీటి విడుదలను ఆపడం సమంజసం కాదని అన్నారు. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్‌కు సింగూర్ ప్రాజెక్ట్‌తో సంబంధం లేదని స్పష్టం చేశారు. రైతుల పంట పొలాలు ఎండిపోతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకరమని, స్థానిక ఎమ్మెల్యేకు ఈ పరిస్థితి కనిపించడంలేదా అని ప్రశ్నించారు. మంజీరా నది వరకు వచ్చిన నీటిని ఘనపూర్ ఆనకట్టకు తీసుకురావడానికి శక్తి లేదా అని ఎమ్మెల్యేపై విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి రైతుల కష్టాలను గుర్తించాలని, పంట వేసే ముందు క్రాప్ హాలిడే ప్రకటించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని తెలిపారు. పంటలు వేసిన తర్వాత క్రాప్ హాలిడే ప్రకటించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సింగూర్ నుంచి ఘనపూర్‌కు వెంటనే 0.3 టీఎంసీ నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల్లోగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరుతూ, లేకపోతే బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. లేనిపక్షంలో రైతులతో కలిసి హైదరాబాద్‌లోని హెచ్‌ఆర్సీని ఆశ్రయిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యకురాలు యం.లావణ్యారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిండ్ల. ఆంజనేయులు, కో కన్వీనర్‌లు గడ్డమీద కృష్ణగౌడ్, లింగారెడ్డి మెదక్, హవేళిఘనాపూర్ మండల పార్టీ అధ్యక్షులు యం. ఆంజగౌడ్, సిహెచ్.శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్‌లు బట్టి ఉదయ్, జుబెర్ అహ్మద్, గౌస్, మాజీ కౌన్సిలర్‌లు మాయ మల్లేశం, ఆర్కె శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు, మెదక్, పాపన్నపేట్, హవెలిఘనపూర్ మండల నాయకులు, రైతులు పాల్గొన్నారు.